D. S. Shankar
VAKKALANKA.

కురూపి

కనకం బస్సుకోసం ముళ్ళమీద నుంచున్నాడు. పట్నంలో బస్సుల కోసం ఇంకోవిధంగా నుంచోవటం సాధ్యంకాదు. తమిళ సోదర సోదరీ మణులు తపశ్శక్తి సంపన్నులు కావటంచేత గాబోలు ముళ్ళ మీద నుంచున్నా బాధపడరు. తెలుగువాడి కాశక్తి లేదు. "నువ్వెక్క దలుచుకన్న బస్సు ఒక జీవితకాలం లేటు" అని ఆరుద్ర అన్నముక్కను తన కనుకూలంగా మలుచుకున్నాడు కనకం. మంచి కవిత్వం పరిస్థితికి అనుకూలంగా మలుగుతుంది.

కనకానికి అవతల అర్జంటుపని వుందనికాదు. అతనికి చెయ్యదగిన పనులన్నీ ముఖ్యమైనవే. తన జీవితంలో ప్రతి క్షణమూ అవసరమైన పనుల క్రిందనే వినియోగ పడాలని అతని ఉద్దేశ్యం. రానిబస్సు కోసం కాచుకుని వుండటమూ, ఊకదంపుడు ఉపన్యాసాలు వినటమూ, క్రాపు చేయించుకోటానికి వెళ్ళి తన వంతుకోసం గంటల తరబడి వేచి వుండటమూ అతనికి ఆయుక్షీణమైన పనులనిపిస్తాయి.

కడుపుతోన్నమ్మ కనక మానదుగనక బస్సు రానేవచ్చింది. మామూలు ప్రకారం బస్సు కిటుకిటు లాడుతున్నది. ఎవరో శిక్ష విధించినట్టుగా, నిలబడిన జనంలో ముప్పాతిక మంది వెనుక భాగంలోనే గడ్డకట్టుకు పోయారు. అక్కడ ఆడవాళ్ళ సీట్లుంటాయి. ఒక్కబస్సులోనేకాదు. ఎక్కడ చూసినా సెక్స్ యావ చాలా జాస్తి అయింది. ఇంక దేనికి లేకపోయినా సెక్స్‌కు స్వాతంత్ర్యం వచ్చిందని కనకం

ఒకసారి అంటే "కాదు: ఈ యావకు కారణం సినిమాలు"! అన్నా రెవరో. స్త్రీ పురుషుల మధ్య వుండే స్వభావసిద్ధమైన పరస్పరాకర్షణకు సినిమాలేకాదు. కథలేకాదు. చాలావిషయాలు దోహదం చేస్తున్నాయి.

"తప్పేమిటి?"అనుకున్నాడు కనకం. ఆడవాళ్ళ సీట్లదగ్గిర కరుడుగట్టిపోయిన జనాన్ని చూసి చీదరించుకుంటూనే, "ఈ దేశంలోవాళ్ళు చాలాకాలం సెక్సనేదిలేనట్టునటించారు. వాళ్ళ తరంలో ముప్ఫైయేళ్ళ మగవాడికిమూడేళ్ళపిల్లను పెళ్ళిచేసేవారనికనకంనాయనమ్మఅంటూండేది. కుటుంబనియంత్రణం అయివుంటుంది. వాళ్ళనాయనమ్మ నలుగురు అప్పచెల్లెళ్ళలోనూ ముగ్గురికి పిల్లల్లేరు; వాళ్ళు ఎవరినో దత్తు తెచ్చుకున్నారు. కనకం తాతయ్యవాళ్ళు నలుగురన్నదమ్ములు; ఇద్దరికి పిల్లల్లేరు. మిగిలిన ఇద్దరి పిల్లల్లోంచి దత్తు చేసుకున్నారు.

జనాభాని అదుపులో వుంచటానికైతేనేం, వైధవ్యం ప్రాప్తించిన అభాగినులచేత చాకిరీ చేయించుకోవటానికైతేనేం, ఒకప్పుడు దేశంలో సెక్స్‌ను చెత్తకన్న క్షుద్రంగా చూశారు. ఇప్పుడు సెక్స్ పగ తీర్చుకుంటున్నది. కనకం ముందుకు వెళ్ళటానికి కూడా, దారిలేకుండా నిలబడిన జనం మొహాల్లో సెక్స్ ఆకలి! శరీరాల్లో సెక్స్ తపన!

ఎట్లాగో వాళ్ళను తోసుకుని ముందుకువెళ్ళి, సముద్రం అడుగునుంచి పైకివచ్చిన తిమింగిలంలాగా, ఆప్యాయంగా మంచిగాలి పీల్చి చుట్టూ కలయచూశాడు. అప్పుడు కనిపించిందామె అతనికి. ఆమె తననిచూసి నవ్వకపోతే ఆమె అనాకారితనాన్ని కనకం అంత పనిపెట్టుకుని చూసి వుండేవాడు కాడు.

"ఎవరో వెకిలిది లాగుంది" అనుకుంటూ కనకం మొహం చిట్లించుకున్నాడు. ఆ మనిషి సంసారపక్షమైన అందం కలదైనా అతను సంతోషించి వుండేవాడేమో. కాని ఏమీ అందంలేని మనిషి

తెలియనివాణ్ణి చూసి నవ్వవలసిన అవసరం ఏమీ లేదు— ఎంత వెకిలి దైనప్పటికీ.

ఆమె తన అందం చూసి నవ్వించని కనకం అనుకునే అవకాశం అసలేలేదు. ఆ బస్సులోనే తనకన్న చిన్నవాళ్ళూ అందంగా డ్రెస్ చేసుకున్నవాళ్ళూ, అందగాళ్ళూ వున్నారు.

'కొంపతీసి నా మొహంలోకూడా సెక్స్ ఆకలి కనిపిస్తున్నదా?' అనుకున్నాడు కనకం. అతని మొహం మరింత మాడింది.

మొదటిసారి కనకం మొహం చిట్లించినప్పుడే ఆమె తననవ్వును ఉపసంహరించేసి మొహం తిప్పేసుకుని మళ్ళీ అతనికేసి చూడలేదు. 'కోపం వచ్చినట్టుంది పాపం!' అనుకున్నాడు కనకం. మనుషులకు మాట్లాడే శక్తి లేకపోయినప్పటికీ ఒకరినొకరు మానసికంగా హింసించుకోగలరన్న మాట. ఈపని పశువులు చెయ్యలేవు. దేర్‌ఫోర్, ఒకరినొకరు మానసికంగా హింసించుకునే శక్తికూడా పరిణామం ద్వారానే మనుషులకు సంక్రమించింది!

'ఇది ఎప్పుడన్నా కథలో పెట్టాలి' అనుకున్నాడు కనకం.

కొందరు కథకులు 'ఏరిన ముత్యాలు' పాశ్చాత్య సాహిత్యం నుంచి సంగ్రహించి తమ రచనల్లో తాపటం చేస్తారు. కనకం తన ముత్యాలను తానే పోదివి వాటిని తన కథల్లో పెట్టటం మరిచి పోతూంటాడు.

అన్నట్టు ఆ అమ్మాయి —! ఒక మనిషిని అవమానించినాక వెంటనే మరిచిపోవటం కనకంలాంటి నడిమధ్య తరగతి వాడికి సాధ్యం కాదు: ఆ శక్తి లక్షలకు విలవైనది.

అతను మళ్ళీ ఆమెకేసి చూశాడు. ఆమె ఆడవాళ్ళ సీటులో కూచోలేదు అమె పక్కన ఎవరో కూచున్నాడు. ఇద్దరి వాలకమూ చూస్తే పరిస్థితులే వారిని ఒక సీటు మీదికి తెచ్చినట్టున్నాయి. ఆమె

కిటికీదగ్గర కూచున్నది. అయన నలభై దాటిన వాడల్లే వుంది. సాధ్య మైనంత వరకు ఆమె తగలకుండా, తాను ఆడదాని పక్కన కూచు న్నట్టు తనకే తెలియదన్నట్టు మొహం పెట్టటానికి యత్నిస్తూ కూచు న్నాడు. ఆమె ఇప్పుడు కిటికీలోనుంచి బయటికి శ్రద్ధగా చూస్తూ, తనను చూసి నవ్వినది మరొకతె అన్నట్టు అభినయిస్తున్నదని కనకానికి అనిపించింది.

"పట్నంలో మగవాళ్ళంత, కాకపోయినా ఆడవాళ్ళ మొహా లలోకూడా సెక్స్ ఆకలి కనిపిస్తూనే వుంటుంది. ఇది అదేరకం కావచ్చు" అనుకున్నాడు కనకం. ఈరకం కూరల మార్కెట్టు దగ్గిరా, బస్సుల్లోనూ, సినిమా హాళ్ళలోనూ, తగులుతారు. ఈ ఆకలి ఉత్తరాది వాళ్ళలోకన్న దక్షిణాది వాళ్ళలో చాలా జాస్తి. కారణం ఏమిటో? మేలుకునివున్న ప్రతి క్షణమూ ఆడది తాను ఆడదాన్నని మరిచి పోలేక పోవటమూ, మగవాడు ఆడదాన్ని చూసినప్పుడల్లా అది ఆడ దన్న ఆలోచన తప్ప మనిషన్న ఆలోచన లేకపోవటమూ ఎంతఘోరం!

ఒక్కొకక్క స్టాపే వచ్చినప్పుడల్లా క్యూ ముందరికి సాగటం వల్ల కనకం ముందుకు వెళ్ళి ఆ అమ్మాయిని అప్పుడే మరిచిపోయినాడు. అతని ఆలోచనలు తాను ఆలోచిస్తున్న కొత్తకథ వేపు వెళ్ళాయి.

కథ రాయటం ఒక కళ అనుకుంటే కనకంలాటి కళాకారులు వింత మనుషుల జాబితాలోకి వస్తారు. అతినికి ఆలోచించదలిస్తే సొంత సమస్యలు ఎన్నయినా వున్నాయి. కాని మనసు నిర్లిప్తంగా వున్నప్పుడు వాటిని గురించి పొరపాటునకూడా ఆలోచించేవాడు కాడు. తాను చదివిన వాటిని గురించో, రాయలనుకున్న వాటిని గురించో ఆలోచించేవాడు. తీరా తన జీవిత సమస్య ఎదురైనదాకా దాన్ని గురించి ఆలోచించే ఓపికలేని కారణంచేత అతను తన జీవితం గురించి చేసే నిర్ణయాలన్నీ అనాలోచితంగా వుండేవి. అతని అప్పులూ,

మిత్రులూ అతన్ని ఒక విధమైన పిచ్చివాడి కింద కట్టేసి. "వీడుకథలు యింతబాగా ఎట్లారాస్తాడు?" అని ఆశ్చర్యపడేవాళ్ళు.

ఆ మాటకువస్తే ప్రతి వాడిలోనూ ఏదోరకం వెర్రి వుంటుంది. డబ్బుకోసమూ కీర్తి కోసమూ యావచ్ఛక్తులు వినియోగించేవాళ్ళు వెర్రవాళ్ళుకారా? జీవితాన్ని అర్థం చేసుకోవటమూ, అనుభవాన్ని జీర్ణించుకోవటమూ నిజమైన జీవిత పరమార్థమని కనకానికి ఒక నమ్మకంవున్నది. అందుచేత జీవిత సమస్యలతో ప్రత్యక్షంగా, ఒంటరిగా పోరాడటంకన్న, పరోక్షంగా పోరాడటమూ తద్వారా పదిమందికీ జీవితం మరింత బాగా అర్థమయేటందుకు తోడ్పడటమూ మంచిపనిగా అతనికి తోచేది. "నాదగ్గిర ధర్మం చెయ్యటానికి ఒక దమ్మిడీ వుంటే దాన్ని నేను కాన్సరు చికిత్సకు దానం చెయ్యాలా? లేక కాన్సర్ పరిశోధనకు ధర్మం చెయ్యాలా?" అన్న ధోరణిలో ప్రొఫెసర్ హాల్డేన్ ఒక ప్రశ్న ప్రతిపాదించాడు. వైద్యులకు కాన్సర్ వ్యాధి అంతుపట్టే దాకా పరిశోధనల కిచ్చే డబ్బే ఎక్కువ సద్వినియోగం అవుతుందని వేరే చెప్పనక్కర్లేదు.

అదే సూత్రాన్ని కనకం జీవితపు సమస్యలు కొన్నింటికి వర్తింపజేసి చూసుకున్నాడు. ఉద్యోగ సమస్యను పరిష్కరించుకున్న వెయ్యిమందికన్న ఆ సమస్యయొక్క స్వభావాన్ని అర్థం చేసుకున్నవాడు ఒక్కడు లోకానికి ఎక్కువ ఉపకారం చేస్తాడు. వివాహ సమస్య లాటిది ఎన్ని లక్షలమంది పెళ్ళిళ్ళు చేసుకున్నా స్పష్టంకాదు. ఈ విధంగా ఆలోచించి, ఆ ఆలోచన ప్రకారం జీవించటం ప్రారంభించి కనకం పిచ్చివాడనే బిరుదు సంపాదించుకున్నాడు.

2

ఎవరో తనను వెనకనుంచి తోస్తున్నట్టు అయేసరికి కనకం వాస్తవ ప్రపంచంలో పడ్డాడు. ఆ అందంలేని అమ్మాయి, తనను రాచుకుంటూ కిందికి దిగిపోయింది. అప్పుడుగాని కనకం తానూ అక్కడే దిగాలని గమనించలేదు. అందరూ దిగిపోయా రనుకుని కండక్టరు బుర్రున ఈలవేసి బస్సు కదిలినాక "హోల్డాన్! హోల్డాన్!" అని కేక పెడుతూ కనకం బస్సు దిగాడు.

అది గౌడీయమఠం స్టాపు. ఈ స్టాపులో తానెందుకు దిగాడో జ్ఞాపకం వొస్తుంది. జేబులో కాగితం చూస్తే వెంటనే జ్ఞాపకం వొస్తుంది. దానికి తొందరేమీ లేదు. కనకం కళ్లు ఆ అమ్మాయికోసం వెతికాయి మరేంలేదు—ఏరకం ఇట్లోకి పోతుందో తెలుసుకోవటానికి! అందువల్ల ప్రయోజనం? ఎప్పుడు ఎందువల్ల ఏం ప్రయోజనముండేది ఎవరు చెప్పగలరు? అది సాధ్యమయ్యేపనికాదని కనకం ముప్పయ్యేళ్ళ అనుభవంలో ఖచ్చితంగా తెలుసుకున్నాడు. ఈ అమ్మాయినే అందగత్తెను చేస్తే ఒక కథకు హీరొయిన్‌గా పనికివస్తుంది. ఆ కథను తాను ఎన్నటికీ రాయకపోవచ్చు— అది వేరేసంగతి.

ఆ అమ్మాయి ఎటో వెళ్ళిపోయుండాలి. పోతేపోయింది. పీడ! కనకం జేబులోంచి ఒక కాగితం తీశాడు. దానిమీద ఆర్. సూర్యనారాయణ అనే పేరు కనిపించింది. అవును. అతనిపేరు సూర్యనారాయణే— సత్యనారాయణకాదు. సన్నగా, పచ్చగా, కొంచెం పొట్టిగా — నే—ఉంటాడు. గానసభ దగ్గిర కలిశాడు. బుచ్చిరెడ్డితో కనకం మాట్లాడుతుంటే ఆగి, కాస్సేపుచూసి, వాళ్ళిద్దరూ మాటలు మాని తనకేసి చూశాక, కనకాన్ని పలకరించాడు. ఊరూపేరూ అడి


Bapu

గాడు. "మీరేకదా కథలు రాసేది ?" అని కూడా అడిగిన మీదట కనకంతో అత్యాశ్చర్యకరంగా చుట్టరికం కలిపాడు. కనకం చిన్నక్క అత్తవారి తాలూకు మనుష్యులు ఆ సూర్యనారాయణకు దగ్గిర బంధువులట. ఆ చుట్టరికం ఏమిటో అతను చెప్పాడుగాని కనకం వినిపించుకోలేదు. "బిచ్చగాళ్ళు చెప్పుకునే సోది ఎంత వినబుద్దేస్తుందో. కొందరు చదువుకున్న వాళ్ళు చెప్పే సోదికూడా అంతే వినబుద్దేస్తుంది" అనుకున్నాడు కనకం సూర్యనారాయణ మాటలు వింటూ.

అప్పుడు కలుసుకున్న ఫలితంగా సూర్యనారాయణ కనకాన్ని తన ఆప్త వర్గంలో చేర్చటమూ, ఆదివారంనాడు తమఇంటికి రమ్మని ఆహ్వానించటమూ జరిగింది. కనకం జేబులో చెయ్యి పెట్టేసరికి సూర్యనారాయణ ఇచ్చిన అడ్రసు కనిపించింది. అప్పటికి ఒక నిర్ధారణకు రాకుండా రాఘవయ్య రోడ్డు బస్‌స్టాప్ దగ్గిరికి వచ్చేసరికి 13 నంబరు బస్సు వచ్చి ఆగింది. కనకం అందులో – ఎక్కేసి గాడీయమఠానికి టిక్కెట్టు తీసుకున్నాడు.

కనకం తన చేతిలోఉన్న కాగితాన్ని చూసుకుంటూండగా, "మీరింకా పైకి పోతున్నారనుకున్నాను" అన్నమాటలు వినిపించాయి. కనకం ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు. ఆ పిల్లే ! కనకం వెనక్కి తిరిగి చూస్తే కనిపించి ఉండేదే. ఆమె దిగిన చోటే నిలబడింది కాబోలు. తాను కదులుతున్న బస్సునుంచి కొంత ముందరగా దిగాడు.

"ఇది నన్ను పట్టుకుందేమిటి ?" అనుకున్నాడు. కాని మొహం చిట్లించకుండా జాగ్రత్తపడ్డాడు.

"మా ఇల్లిదగ్గిరే, రండి పోదాం" అన్నదా అమ్మాయి.

ఆమె సాహసానికి కనకం నిర్ఘాంత పోయాడు. తనని గురించి ఆమె అభిప్రాయం ఏమిటి ? ఏ ఆడకుక్క చూపుడువేలు ఆడించినా తాను పరిగెత్తుకుంటూ వచ్చేస్తాడనా ?

కనకం నాజూకైన వెటకారంతో "వద్దునుగాని నాకు మరో చోట ఎంగేజిమెంటున్నది" అంటూ చేతిలోవున్న కాగితం ముక్క ఆడించాడు.

ఆమె చెయ్యిచాచి కాగితం తీసుకుని చూసి "ఇదే మా యిల్లు" అన్నది.

ఈసారి కనకం గట్టిదెబ్బ తిన్నాడు. మహా మహా వాళ్ళక్కూడా ఎక్కడన్నా దాక్కోవాలనిపించే సమయాలు సంప్రాప్త మవుతాయి. కాని కనకానికి ఇంత పరాభవం ఎప్పుడూ ఎదురుకాలేదు. "వద్దును గాని"... ఘోరం! అందులోనూ వెటకారంగా! ఎంతనీచం!

"నే నెవరో తెలుసునన్నమాట!" అన్నాడు కనకం హీన స్వరంతో.

"మీరెవరో తెలీకుండానే మా యింటికి ఆహ్వానించా ననుకున్నారన్నమాట!" అన్నదా అమ్మాయి నిష్కల్మషంగా నవ్వుతూ.

శిఖండి చాటునుంచి అర్జునుడు భీష్ముణ్ణి కాలసర్పంలాటి బాణం వేసి కొడుతూ, అపేక్షగా నవ్వితే భీష్ముడెట్లా ఉండి ఉండునో కనకానికి అర్థమయింది. అతనికి తాత్కాలికంగా మాటపడిపోయిన సంగతి గ్రహించిన దానల్లే ఆమె "నాపేరు సరస్వతి. సూర్యనారాయణ మా అన్నయ్య ఆరోజు పాటకచ్చేరీ దగ్గిర మా అన్నయ్యా మిమ్మల్ని చూశాడు. నన్ను మీకు చూపానన్నాడు. మీరు బహుశ నన్ను చూచిఉండరు. మిమ్మల్ని బస్సులో చూడగానే పోల్చుకున్నాను. మా యింటికే వస్తున్నారేమో ననుకున్నానుకూడా. కాని మీరు నన్ను చూసి గుర్తుపట్టక పోయేసరికి మీరు మమ్మల్ని అప్పుడే మరిచిపోయా రనుకున్నా. వారం గడిచింది చూడండి. నేననుకున్నట్టే మీరు నాతో బాటు బస్సు దిగే ప్రయత్నం చేయలేదు. ఏదో ఆలోచనలో ఉండి ఉంటారు. ఏ కథ ఆలోచిస్తూ ఉండివుంటారు" అన్నది.

"అవును" అన్నాడు కనకం. ఆమె తనని వెటకారం చేస్తున్నదని కూడా అతనికి స్ఫురించలేదు.

"మనం పోదామా" అని సరస్వతి అన్నమీదట కనకం బరువు కాళ్ళతో కదిలాడు. ఆమెకు ఏదోరకం క్షమాపణ చెప్పుకోకపోతే అవమానభారం అతని పైనుంచి దిగేట్టులేదు. కాని క్షమాపణ ఎట్లా చెప్పాలో తెలీలేదు. తను అన్నమాట ఆమె తన అన్నతో చెప్పవచ్చు. చెప్పకుండా మానదగిన కారణం లేదు.

ప్రపంచంలో మంచిచెడ్డలు ఆనేక పాళ్ళలో వుండేవాళ్ళున్నారు. తాను కథకుడు కాకముందు ఏమనిషి స్వభావం ఎటువంటిదో రూఢిగా తెలిసినదాకా మనిషిని అంచనా వేసేవాడు కాడు. ఇప్పటికీ అతనికి ఇతరుల చెడునుగురించి మరొకరితో చర్చించే అలవాటులేదు. కొందరికి ఇతరుల లోపాలను గురించి ఎంత చెప్పుకున్నా తనివితీరదు, కనకం లెక్కప్రకారం అదొక జాడ్యం. కాని మనిషిని చూస్తూనే సాధ్యమైనంత విపులంగా ఆ మనిషిని అంచనా కట్టాలన్న తహతహ అతనిలో బాగా బలపడింది. తన అంచనాలు అనేకమార్లు గురికి బారెడు ఎడంగాపోవటం జరిగింది అయినా అది తన రహస్యం మాత్రమే అయినంత కాలమూ అతని అంతరాత్మ ఘోషించలేదు. నిజానికి అతను బహిరంగంగా ఇంత "దూడ" ఎన్నడూ వెయ్యలేదు. బయటు పడనంత కాలమూ అతని తప్పుడు అంచనాలు అతనికేమీ నష్టంచెయ్యలేదు— లాభించాయికూడా. తాను తప్పుగా ఊహించుకున్న మనస్తత్వాన్ని పాత్రలకు అంటుగట్టి మంచి సజీవ పాత్రలను సృష్టిస్తాడన్న ఖ్యాతి కూడా కొంత సంపాదించుకున్నాడు. "నువ్వు ఫలాని కథలో సృష్టించిన ఫలాని పాత్ర అచ్చు ఫలాని మనిషే" నంటే "ఆమనిషి నాకు తెలియను కూడా తెలియదు" అనదగిన స్థితిలో వుంటూ వస్తున్నాడు కనకం. ఒకవేళ తెలిసిన మనిషి అయినా 'నాకు తట్టలేదు సుమా!' అని చిత్తశుద్ధితో అనగలిగేవాడు.

కాని ఇదేమిటి? ఈ సరస్వతిని గురించి అతను అనుకున్నదంతా అపోహే! ఆమె తనను గురించే నవ్వింది. తాను మొహం చిట్లించగానే అవమానపడి మొహం తిప్పేసుకున్నది. ఆ మూగ అవమానంతో పోనివ్వక తాను ఆమాట ఎందు కనవలసివచ్చింది? ప్రారబ్ధంలోనూ, గ్రహచారంలోనూ నమ్మకంలేదు.

ఇద్దరూ కలిసి నడుస్తున్నారు. ఆమె అకస్మాత్తుగా తల పక్కకి తిప్పి అతనికేసిచూచి "ఏమిటాలోచిస్తున్నారు?" అన్నది.

"నా అతితెలివికి కారణం ఏమిటా అని ఆలోచిస్తున్నాను. ఒకొ్కసారి మనం మనకే తెలియనంత గొప్పవాళ్ళమై పోతూంటాం!" అన్నాడు కనకం.

ఆమె దీనికేమీ అనకపోవటం ఎట్లా గ్రహించాలో కనకానికి తెలియలేదు. ఆమెకు తన మాటలు అర్థం కాలేదా? లేక అది ఆమెకు తగిన క్షమాపణగా తోచలేదా? కాని ఆమాట అనెయ్యటం మంచిదయింది కొంత బరువు దిగింది. ఆమె ఇంకా నూటి క్షమాపణ కోరే పక్షంలో తాను తప్పక యిస్తాడు.

"మా అన్నయ్యకు మీ కథలంటే చాలా యిష్టం. మీరు రాసిన కథలన్నీ చదివాడని నా నమ్మకం" అన్నది సరస్వతి.

"నాతో ఆమాటే అన్నారు" అన్నాడు కనకం.

"ఒకొ్కక్క ఆర్టిస్టు అదృష్టం... అటువంటి వాళ్ళు మనుషులను తృప్తి పరచటంతో ఊరుకోక వాళ్ళ మనసును జలగల్లాగా పట్టేస్తారు. లతా పాటకు నే నలాగే అవుతాను."

"అనుభవించే వాళ్ళలో కూడా చాలా వుంటుందేమో!" అన్నాడు కనకం.

"అనుభవించే శక్తి వుంటుంది. అంతకన్న ఇంకేముంటుంది?" అన్నది సరసతి.

'అందులో ఆర్టిస్టు అదృష్టం ఏముందీ?'

"డబ్బుతోనూ, అందంతోనూ కాకుండా ఇంకే విధంగానైనా ఇతరులను ఆకర్షించ గలవాళ్ళు అదృష్టవంతులనే నా నమ్మకం. ఇదే మె ముండే యిల్లు."

3

కనకాన్ని చూసి సూర్యనారాయణ ఎంత సంతోషం కనబరిచాడంటే, కనకానికి ఒక అనుమానం తగిలింది. తనను యింటికి రమ్మని పిలిచిన సంగతి అతను పూర్తిగా మరిచిపోయినట్టున్నాడు. ఇవాళ మరవటం కాదు. కిందటి ఆదివారం రాత్రి తనను ఆహ్వానించిన మరుక్షణమే మరిచివుండాలి. కనకం తమ యింటికి వస్తున్నాడనుకున్నట్టు సరస్వతి అన్నమాట నిజం కాకపోవచ్చు. ఒకవేళ నిజమైనా అన్న అతని కిచ్చిన ఆహ్వానం గురించి ఆమెకు తెలిసి వుండక పోవచ్చు. రూఢిగా తెలిసివుంటే బస్సులోనుంచి ఒంటరిగా దిగిపోదు ...

సూర్యనారాయణ కనకానికి తన భార్యనూ, ఇద్దరి పిల్లలనూ పరిచయం చేశాడు. సూర్యనారాయణ భార్య జయలక్ష్మిని అందగత్తెలలో జమకట్టవచ్చు. సరస్వతి ప్రక్కన మరికొంచెం అందంగా కనపడింది. అయితే ఆమెలో ఆకర్షణీయంగా కనిపించాలనే ఆపత్రయం అందాన్ని మించి వున్నది. కనకం అక్కడ వున్న గంట కాలంలో జయలక్ష్మి ఏదో పనిమీద వెళ్ళినట్టు పడకగదిలోకి వెళ్ళి అయిదారుసార్లు మొహానికి పౌడరు వేసుకు వచ్చింది. పెదవులు తడిగా, నవ నవ

లాడుతూ వుండగలందులకు ఆమె అస్తమానం కనీసం పై వాళ్ళు న్నంత సేపూ— నాక్కుంటుందని కనకం గమనించాడు.

సరస్వతీ కనకమూ కలిపి రావటంచూసి సూర్యనారాయణ వాళ్ళిద్దరికీ పరిచయం అయిందనుకున్నాడు. సరస్వతే అతన్ని తీసుకు వస్తున్నదనుకున్నాడు. అదేమీ జరగలేదని తెలిశాక అతను ఆమెను పరిచయం చేస్తూ 'మా చెల్లెలు, సరస్వతి. ఎమ్మే ప్యాసయింది. లెక్చ రరుగా పనిచేస్తున్నది' అన్నాడు.

ఈమాట చెవిని పడగానే కనకం సరస్వతికేసి మరొకసారి చూశాడు. ఆమె మొహంలో ఈసారి అతనికి ఎమ్మే జాడల్లూ, లెక్చ రరు కవళికలూ కనిపించాయి. ఇదికూడా అతనికి పరిపాటే. ఒకసాం ఏదో పత్రిక తిప్పుతుంటే ఒక నీగ్రోవాడి బొమ్మ కనిపించింది. ఆ బొమ్మ క్రింద ఆనీగ్రో దక్షిణాఫ్రికాలోని ఒక ప్రసిద్ధ తెగకునాయకుడని రాసివుంది. మళ్ళా బొమ్మకేసిచూస్తే ఆ నీగ్రోవాడు మామూలు నీగ్రో వాడిలాగా లేడు. అతనిలో రాజలక్షణాలు కొట్టవచ్చినట్టుకనిపించాయి. వాస్తవం తెలపటానికి జ్ఞానేంద్రియాలు చాలవనీ, వార్తా పత్రికలు కూడా కావాలనీ రుజువు చెయ్యటానికి ఇంతకన్న ఏం కావాలి ?

సూర్యనారాయణ పిలలు—కొడుకూ, కూతురూ—తల్లిదగ్గిర కన్న సరస్వతి దగ్గిర హెచ్చు మాలిమిగా కనబడ్డారు. కాని జయలక్ష్మి వాళ్ళను ఒక కంట చూస్తూనే ఉన్నది. మధ్య మధ్య వాళ్ళను కళ్ళతో హెచ్చరిస్తున్నది. పిల్లలకు తల్లి బెదురు బాగానే ఉన్నట్టున్నది.

వచ్చిన అయిదు నిముషాలలోనే కనకం జయలక్ష్మి తనకు నచ్చేరకం కాదని తేల్చుకున్నాడు. అతిధిగా వచ్చిన తనపట్ల ఆమె చూపించే శ్రద్ధాసక్తులన్నీ కృత్రిమంగా కనిపించాయి. లోపలికి వెళ్ళే టప్పుడు తనకేసి నవ్వి ఇప్పుడే వస్తానన్నట్టు తల ఆడించి. అతని అనుజ్ఞతో వెళ్ళినట్టు నటిస్తుంది. ఇంత పౌడరు పాముకుని తన విషయం చూడటానికే వచ్చినదాని మొహం పెడుతుంది.

సూర్యనారాయణ పాట కచ్చేరినుంచి సరస్వతితో సహా ఇంటికి తిరిగివచ్చి, కథలు రాసే కనకాన్ని చూశాననీ, పై ఆదివారం టీ కి పిలిచాననీ చెప్పినప్పుడు జయలక్ష్మి 'ఎందుకు కోరితెచ్చుకుంటారో ఇలాటి తద్దినాలన్నీ!' అన్నసంగతి కనకానికి తెలీదు. తెలి

సినా పెద్దగా ఆశ్చర్యపడి ఉండేవాడు కాడు. ప్రతి మనిషికీ రెండు ముఖాలుంటాయిగాని. కొందరి ఈ రెండు ముఖాలకూ కొంచెమైనా పోలిక ఉండదు. జయలక్ష్మి ఆ తరగతిమనిషి అయితే కనకానికేమీ ఆశ్చర్యం లేదు.

"ఆరోజు పాట కచ్చేరికి మీరుకూడా వచ్చారా?" అని కనకం జయలక్ష్మిని అడిగాడు.

"లేదండీ! నాకు పాట అంటే అంత ఇష్టంలేదు. రేడియోలో పగలువచ్చే పాటలంత ఇబ్బంది పెట్టవుగాని, రాత్రి తొమ్మిదీ, పది గంటల దాకా పాటకచ్చేరీ వింటే తలనొప్పొచ్చి తెల్లార్లూ నిద్ర పట్టదు" అన్నది ఆమె.

కనకానికీ తమకూ గల చుట్టరికం గురించి సూర్యనారాయణ గాని సరస్వతిగాని ఆట్టే మాట్లాడలేదుగాని. వాళ్ళకన్న దగ్గిర బంధువు లాగా జయలక్ష్మి "మీ పెద్దక్కగారి కెందరుపిల్లలు? చిన్నక్కకో? ఆవిడ భర్తేకాదూ మా మావగారి పెత్తల్లి మనవడూ? ఆవిడకెందరు పిల్లలు" అని ప్రశ్నలు ప్రారంభించింది.

అన్నిటికీ కనకం, "నాకు తెలీదు" అని జవాబు చెప్పాడు. తాను తనవాళ్ళని చూసీ వాళ్ళకు ఉత్తరాలురాసీ ఏళ్ళకేళ్ళయిందని కూడా అన్నాడు.

"అదేమిటలాంటారు?" అన్నాడు సూర్యనారాయణ.

"బంధుత్వాలంటే పనికిమాలిన బంధాలు. కొంతకాలం వాటి వల్ల ఉపయోగం వుంటుంది. ఆ తరవాత అవి సంకెళ్ళే. నేను నా సంకెళ్ళనన్నిటినీ విడగొట్టుకున్నాను. నిజమైన ఆపేక్షలు మాత్రం దక్కించుకున్నానన్నమాట. వాటిని తెంచలేం" అన్నాడు కనకం.

"ఆపేక్షలవల్ల ఉపయోగం వుందంటారా?" అన్నది సరస్వతి.

కనకం కొంచెం ఆలోచించి, "ఏమీా లేదు" అన్నాడు. ఈ సమాధానం సమగ్రంగా లేదని తోచి "ఆపేక్ష లుండటమే జీవితానికి ఒక ఆనందం" అన్నాడు.

"ఎవరన్నా వున్న ఆపేక్షలతో తృప్తిపడవలసిందేగాని లేని ఆపేక్షలు లేకపోయెనే అనుకోరుగద" అన్నది సరస్వతి.

ఆమె ఏమనటానికి ప్రయత్నిస్తున్నదో కనకానికి అర్థంకాలేదు అతను "అవును" అన్నాడు, ఐతే ఏమంటూ వన్నట్టు.

"ఎవరిమీాదా ఆపేక్షలేనివాళ్ళు తమ జీవితానికి ఆనందం లేదనుకుంటారా ?" అని సరస్వతి అడిగింది.

"అనుకోకపోవచ్చు" అన్నాడు కనకం.

అదే తా ననేదీ నన్నట్టు సరస్వతి తల ఆడించింది.

"మా సరస్వతికి ప్రేమలో నమ్మకం లేదులెండి" అన్నది జయలక్ష్మి.

"బంధుత్వాలు సంకెళ్ళయితే ప్రేమలు రెట్టింపు సంకెళ్ళు. మీా కథలురాసేవాళ్ళూ, సినిమాలవాళ్ళూ దానికి వల్లమాలిన పబ్లిసిటీ యిచ్చారు. నన్నడిగితే న్యూశ్యెరియస్ డ్రగ్ చట్టం ప్రేమకు అప్లయ్ చెయ్యొచ్చు" అన్నది సరస్వతి.

కనకానికి రోషం వచ్చింది. "అకారణంగా లోకమంతా ఏకమై ప్రేమకు ప్రచారం ఎందుకిస్తుంది ? ఏదో కారణం వుండాలికదా ?" అన్నా డతను.

"కారణం ఏం చెబుతాం ? ఆత్మవంచన కావచ్చు, పరవంచన కావచ్చు."

కనకం అట్టే వాదం పెంచదలచలేదు. విషయం వాదనద్వారా ఋజువయేది కాదు. అది అట్లావుంచి అతను సరస్వతి దృక్పథాన్ని సానుభూతితో చూశాడు. ప్రేమవల్ల ఆమెకు పెద్ద అపచారం జరిగి

వుండవచ్చు. బెడిసికొట్టిన ప్రేమా, న్యాయమూ, ధర్మమూ లాటివి అవాస్తవంగా కనిపించటంలో ఆశ్చర్యంలేదు. తనకు బంధుత్వాలంటే అసహ్యం పుట్టలేదా? కనువిప్పునేదే కనుమూతకూడా కావచ్చు.

కొంతసేపటికిందలోపలికి వెళ్ళిపోయిన జయలక్ష్మి సరస్వతిని కేకపెట్టింది. సరస్వతి వెళ్ళిపోయినాక కనకమూ, సూర్యనారాయణా కాస్సేపు ఎవరి ఆలోచనల్లో వారు వుండిపోయారు. కనకం తాము కూచున్న గది కలయజూశాడు. గదిలో అవసరమైన వస్తువులతోబాటు అలంకరణలుకూడా వున్నాయి. వాటికి జయలక్ష్మి బాధ్యురాలై వుండ వచ్చునని కనకం అపోహపడ్డాడు. సౌందర్యతృష్ణ సరస్వతిలో వుండ వచ్చునని అతనికి తట్టలేదు.

ఉన్నట్టుండి సూర్యనారాయణ "మా సరస్వతికి ఇరవైనాలుగో ఏడు. దాని కింకా పెళ్ళికాలేదు. ఆ విషయం ఎత్తినప్పుడల్లా నాకు పెళ్ళి చేని కంటుంది; మనుషులు సంసారజీవితం అక్కర్లేకుండా బతక గలరన్నట్టుగా ప్రవర్తించే వాళ్ళంటే నాకు మంట. ఆ విషయమై ఒక ఉద్యమమే లేవదీసిన వీరేశలింగంధైర్యం తలుచుకుని నే నాశ్చర్య పడతానంటే నమ్మాలి. సంఘ నిబంధనల మూలంగా ఆడది ఒంటరి బతుకు బతకటమే ఘోరమైతే, నిష్కారణంగా ఆడది జన్మల్లా ఒంటరిగా బతకాలని పసితనంలోనే నిర్ణయించటం ఎంత ఘోరమో ఆలోచించండి. తనకు పెళ్ళి వద్దని అది యిప్పటికి ఆరేళ్ళనుంచీ అంటూనే వున్నది. యింకో పదేళ్ళకి మొగుడికోసమూ, పిల్లలకోసమూ కోరిక పుడితే అది తీరే అవకాశం అసలే వుండదని నాబాధ" అన్నాడు.

"ఆడదిగాని, మగాడుగాని తమకుతామై ఒంటరిగా ఉండగోరితే అందులో ఘోరమేమిటో నాకు అర్థం కాలేదు. అక్రమమైన సంఘ నియమాల ప్రోద్బలంవల్ల బాలవితంతువులకు సంసార జీవితం లేకుండా పోతే అది నిజంగా ఘోరమే" అన్నాడు కనకం ఉపన్యాస ధోరణిలో.

సూర్యనారాయణ నవ్వి "మీరింకే మంటారు? మీకింకా పెళ్ళి కాలేదనుకుంటాను?" అన్నాడు.

"లేదు, కాని నేను భీష్మించ లేదు. నాకు పెళ్ళి చేసుకోవటాని కభ్యంతరంలేదు. మామూలు పెళ్ళి చేసుకు నే ఉద్దేశం నాకులేదు. నాకు సరిఅయిన భార్య అయే మనిషి కన్య కానవసరం లేదు. వితంతువయినా పిల్లలు గలదైనా, నాకన్న పెద్దదయినా కూడా ఫరవాలేదు. అందు చేత నా విషయం వదిలెయ్యండి. మీ చెల్లెలల్లే కాదు — నాకు ప్రేమలో నమ్మకం వుంది" అన్నాడు కనకం.

సూర్యనారాయణ తల అడ్డంగా తిప్పి, "ఈ నమ్మకాలు నాకర్థం కాలేదు. మా సరస్వతి తనకు ప్రేమలో నమ్మకం లేదంటుంది.—కాని ఉన్నట్టే ప్రవర్తిస్తుంది. దానికి పెళ్ళంటే ఎందుకిష్టం లేదనుకున్నారు? తను అందగత్తె కాదని. తనను ఎవరూ ప్రేమించరనీనూ. బొత్తిగా లేనివాళ్ళం కాదు. ఉన్నది తెగనమ్మి కట్నంపోసి అయినా తనకు కావలసిన సంబంధం తెస్తానన్నాను. డబ్బుకోసం పెళ్ళాడేవాడు తనకు కావలసిన మొగుడెట్లా అవుతాడన్నది. గంతకు తగిన బొంత అన్న పద్ధతిలో తనను బోలినవాణ్ణి చూసుకోమన్నా వినదు" అన్నాడు.

"పెళ్ళంటే భయమేమో?" అన్నాడు కనకం. "నాకున్నది చెప్పొద్దూ!"

"అలా అనుకోను" అన్నాడు సూర్యనారాయణ.

ఇంతలో టిఫినూ కాఫీ వచ్చాయి. సూర్యనారాయణ ఆతిథ్యం స్వీకరించి అందరి దగ్గిరా సెలవు పుచ్చుకుని కనకం బయలుదేరాడు.

"పరాయివారు కారు మాకు బంధువులే: ఎప్పుడన్నా వస్తూం డండి" అన్నది జయలక్ష్మి.

4

కనకం స్వతహాగా ఏమంత సంపన్నుడు కాకపోయినా మొదటినుంచీ అతనికి ధనికుల స్నేహం వున్నది వాళ్ళు అతన్ని తమతో సమంగా పోషించారు. కనకానికి పొలాలమీద ఏటా రెండువేలకు తక్కువ కాకుండా వస్తుంది. కాని అతను ఎనిమిది పది వేల స్థాయిలో బతికేవాడు. అతను స్నేహితుల ధర్మమా అంటూ ప్రతి వేసవీ ఊటీలో గడిపేవాడు. కాశ్మీరూ, సిమ్లా, డార్జిలింగూ మొదలైన చోట్లకి ఫస్టుక్లాసు ప్రయాణాలు చేశాడు. రెండుసార్లు ఢిల్లీ వెళ్ళాడు. తామంటే భయపడనివాడు వెంటవుంటే ధనికులు వాణ్ణి తమతో సమంగా చూస్తారు.

ఇప్పుడు పట్నంలో అతనుంటున్నది అతని మిత్రుడు భవానీ ప్రసాదువాళ్ళ ఇంట్లోనే. ఇంటి పనివాళ్ళు అతని పనివాళ్ళే. భవానీ ప్రసాదు భార్యకూడా కనకాన్ని ఆప్తుడల్లేనే చూసేది. 'నువ్వు' అనేది. తన పెత్తండ్రి కూతుళ్ళూ, సొంత అప్పలూ తనపట్ల ఎట్లా ప్రవర్తించారో తలుచుకుంటే కనకానికి భవానీప్రసాదు భార్య ప్రవర్తన అత్యాశ్చర్యకరంగా కనిపించేది.

ఆ భార్యాభర్తల దాంపత్యంకూడా కనకానికి అసాధారణంగా కనపడింది. ఎందుకంటే వాళ్ళు ఎప్పుడూ చిన్న వాగ్వాదం చెయ్యగా కూడా కనకం చూడలేదు. అది ప్రేమతోకూడిన దాంపత్యం అవునో కాదో కూడా. అతనికి తరుచు రెండు రకాలే కనిపిస్తాయి. హెచ్చుమంది తమ 'వ్యక్తిత్వాల'తో ఒకరి కొకరు ఒరుసుకుంటారు. బహు కొద్దిమంది ప్రేమ మూలంగానో, మోహం మూలంగానో తమ వ్యక్తిత్వాలను —కనీసం కొంతకాలంపాటు – చంపేసుకుని పై వాళ్ళకు

ఎబ్బెట్టుగా కనిపిస్తారు. భవానీప్రసాదూ భార్యా ఈ రెండురకాల లోనూ చేరరు.

కనకం వారి దాంపత్యజీవితంగురించి అసూయపడలేదు. అతనికి కావలసింది అటువంటి దాంపత్యం కాదు.

ఈ దాంపత్యాల ఆలోచన ఇటీవల అతని బుర్రలో జాస్తిగా మసులుతూ ఉండటానికి కారణం అతను అదే విషయంమీద కథ ఆలోచిస్తున్నాడు. ఇవాళ ఆ ఆలోచన ఒకదారికి వచ్చింది. అందుచేత అతను మధ్యాహ్నం భోజనం చెయ్యగానే రాయటం ప్రారంభిం చాడు. అది పూర్తి అయేసరికి అయిదుగంట లయింది.

కథ అయిపోవటానికీ, కల అయిపోవటానికీ కొంత పోలిక ఉంది. కనకం అప్పుడే మేలుకున్నట్టుగా తన గది అంతా కలయ జూశాడు. లేచి నిలబడి ఒళ్ళు విరుచుకున్నాడు. కొళాయిదగ్గరికి వెళ్ళి సబ్బుతో మొహం కడుక్కుని, బట్టలు వేసుకుని, కాలినడకన పానగల్ పార్కు కేసి బయలుదేరాడు. రేడియోలో ఒక్కోసారి మంచిసంగీతమే వస్తుంది.

కనకం కాఫీ తాగుదామని పార్క్‌లాండ్స్ దగ్గరికి వెళుతుండగా అప్పుడే బస్సు దిగింది కాబోలు, చేతిలో ప్లాస్టిక్ సంచి పట్టుకుని సరస్వతి రోడ్డుదాటి కూరల మార్కెట్టుకు పోబోతూ కనిపించింది. ఆమె కార్లకోసం రోడ్డు ఎగువకేసి చూడటంలో కనకం ఆమెకు కనిపించాడు.

ఇద్దరూ ఆగి ఒకరినొకరు సమీపించారు. ఎందాకా అంటే ఎందాకా అని అడుక్కున్నారు. "కూరలు కొనుక్కుపోదామనీ, కాస్సేపు పార్కులో కూచుందామనీ వచ్చాను." అన్నది సరస్వతి.

"సాయంకాలం వేళ నేనీ పార్కుకు రోజు విడిచి రోజన్నా వస్తాను. మీరెన్నడూ కనిపించినట్టులేదే?" అన్నాడు కనకం.

"నేనైనా ఎప్పుడోగాని రాను. ఈ పూట మావాళ్ళంతా బీచికి వెళ్ళారు. మా వదినిగారివైపు బలగం వచ్చారు తిరుపతి నుంచి. మెరీనా చూడందే వెళ్ళమన్నారు. నన్నుకూడా రమ్మన్నారు. రానన్నాను. వాళ్ళు ఏ తొమ్మిదికో వచ్చేసరికి వంటచేసి ఉంచుతానని మాట ఇచ్చాక నన్ను వొదిలేశారు" అన్నది సరస్వతి.

కనకం సరస్వతి వెంటవుండి కూరలు కొనిపించి సంచీ తాను తీసుకున్నాడు.

"ఫరవా లేదు. నేను మోస్తాను. సన్నగా ఉన్నా నాకు నాజూకూ నీరసమూ అన్నవి లేవు మీ దయవల్ల" అన్నది సరస్వతి.

ఇద్దరూ పార్కు ప్రవేశించి, ఇంచుమించు ఖాళీగావున్న ఒక సిమెంటు సీటుమీద కూచున్నారు. తన పక్కనే కూచున్న సరస్వతి కేసి ఒక్కచూపు చూసి, అంతకు మునుపు ఆ సీటును భుక్తం చేసుకున్న మనిషి చివాల్న లేచి దూరంగా వెళ్ళి గడ్డిమీద కూచున్నాడు.

సరస్వతి నవ్వుతూ కనకం కేసి తిరిగి "చూశారా, నా గాలి సోకుతుందని మగవాళ్ళు ఎలా బెదిరి పారిపోతారో ?" అన్నది.

"అదీ ఒక క్వాలిఫికేషనే. అయితే నా మీద ఆ మంత్రం పారలేదు. నేను పారిపోను" అన్నాడు కనకం. అతను ఆమాట సరదాకన్నట్టే అన్నాడుగాని అందులో కొంత నిజం వున్నట్టు అతనిమనస్సుకు తోచింది. "హాయిగా ఒంటరిగా కూచుందా మనుకుంటే ఈ మనిషి ఎక్కడ దాపరించిందిరా బాబూ?" అన్నభావం అతనికి కలగలేదు. ఆమె కనిపించటం కాలక్షేపానికి సహకరిస్తుందనే భావమే అతనిలో కలిగింది.

కేవలం సెక్సు దృష్టితో చూడకపోతే సరస్వతి అంత వికారంగా కనిపించలేదు. ఆమెను తన వెంట చూసి ఎరిగినవాళ్ళు ఎగతాళి చేస్తారేమోననికూడా అతనికి అనిపించలేదు. ఆ క్షణంలో ఎరిగినవాడెవరన్నా

కనిపిస్తే కనకం గర్వంగా ఆమెను పరిచయంచేసి వుండును. "ఈమె సరస్వతిగారు, ఎమ్మే. అదేదో కాలేజీలో లెక్చరర్. మాకు దూరవు బంధువుకూడానూ!"

దురదృష్టవశాత్తూ అతనికి ఎరిగినవా ళ్ళెవరూ కనిపించలేదు.

"ఇవాళే మీ కథ—'విషబీజం' చదివాను.మా అన్నయ్య మీ కథలు ఎందుకు నెత్తిన పెట్టుకుంటాడో నేను అర్థం చేసుకోగలను" అన్నది సరస్వతి.

"అప్పుడే పత్రికలో వచ్చిందా. నా కాపీ పోస్టులో యింకా నాలుగురోజులకుగాని రాదు. మీ అన్నయ్య కెందుకు నా కథ లిష్ట మంటారు? అట్లాగే మీ విషయంకూడా చెప్పేస్తే సంతోషిస్తాను."

"నా విషయమా?" అన్నది సరస్వతి ఆశ్చర్యంగా.

"మీకు నా కథ లెందుకు నచ్చవో!"

"నాకు నచ్చవన్నానా?"

"వేరే అనాలా?"

సరస్వతి కొంచెం ఆలోచించి "మీ కథల్లోవుండే పాత్రలు మా అన్నయ్యకు కావలిసినవి. మామూలు మనుషులు అలావుంటే తనకు చాలా యిష్టం" అన్నది.

కనకం ఆశ్చర్యపోయాడు. "నా పాత్రలు స్వాభావికంగా వుండవా ఏమిటి కొంపదీసి?" అన్నాడు.

"అదికాదు నా వుద్దేశ్యం. మీరు మీ పాత్రలను బహు అల్ప సంఖ్యాకులనుంచి ఎన్నుకుంటారు.ఉదాహరణకి చెబుతాను; మీ హీరోయిన్ లందరూ అందగత్తెలే. హీరోలను తీసుకున్నా, రూపు-రేఖలకి మీ కన్న తీసిపోయేవాళ్ళున్నట్టు కనబడదు. కొద్దిమంది మీ కన్న

కూడా అందంగా వుంటాడు అందమైనవాళ్ళు అల్పసంఖ్యాకవర్గం కారని మీ రనగలరా ?'

కనకం ఆమెకేసి నిర్ఘాంతపోయి చూశాడు. ఈ విధంగా తన కథలమీద ఏ విమర్శకుడుకూడా ధ్వజమెత్తడు.

'హీరోగాని, హీరోయిన్‌గాని అందంగా వున్నంతమాత్రాన కథకుగాని, కథయొక్క ప్రయోజనానికి గాని యిబ్బందా ?' అని అతను ఉపన్యాస ధోరణిలో అడిగాడు.

'కథంతా మారిపోతుందని నా అనుమానం. నేను ఎక్స్‌పర్ట్‌గా చెప్పడంలేదు సుమండీ! సినిమా స్టార్లకూ మామూలు ఆడవాళ్ళకూ తేడా ఒక్కొక్కప్పుడూ ఆకర్షణలోనే. మీరెప్పుడన్నా రత్నావళిని స్టేజీమీద చూశారా? కిందటి నెలకూడా వేషంవేసింది. తెలుగుదే. రేడియో నాటకాల్లో చదువుతుంది. నా స్నేహితురాలు. గొప్పనటి— నామాట మీరు నమ్మగలిగితే. అయితేనేం? సినిమాల్లో దాసీదాని వేషం కూడా ఇవ్వరు. చూడటానికి ఒకమాదిరిగా ఉంటుంగి. ఏ మాత్రమూ ఫొటోజెనిక్ మొహంకాదు'

'నేను సినిమా స్టార్లలాటిపాత్రలు తీసుకోవటంలేదే. మామూలు జీవితాలు జీవించేవాళ్ళనే తీసుకుంటున్నాను కనీసం నా కథలు సినిమాలుతీయటానికైనా పనికిరావే. వాటిలో సినిమా సన్నివేశాలుండవు.' అన్నాడు కనకం దీనంగా.

'నే నన్నది మీరు సరిగా అర్థం చేసుకోలేదు. అందం జీవితంలో ఒక ప్రత్యేక పాత్ర గలిగి ఉంటున్నదనటానికి చెప్పాను. పెళ్ళాలు అందంగానూ, స్టయిలిష్‌గానూ లేని వాళ్ళను డిప్లొమాటిక్ సర్వీసులోకి తీసుకోరట! మీ కథల్లోకూడా అందానికి అలాంటి ప్రాముఖ్యమే ఉంటున్నదని నా ఉద్దేశ్యం' అన్నది సరస్వతి.

'నా ఏ కథలో నన్నా హీరోయిన్ అందగత్తెగాక కురూపి అయితే ఆ కథను మార్చవలసి వస్తుందా?'

'మార్చవలసి వస్తుం దనుకుంటానండి. మీ 'ఊబిలో మను షులు' తీసుకోండి. భర్త లేనిపోని నాగరికతలకు పోయి పెళ్ళాన్ని సొసైటీ లేడీ చేయ యత్నిస్తాడు. 'వద్దు మొర్రో' అని మొదట్లో అన్న భార్య చివరకు భర్తకు విడాకు లిచ్చేదాకా వస్తుంది. ఆమె అందగత్తె కనక నేగదా భర్త తన అవమానాన్ని దిగమింగి మళ్ళీ ఆమెను యేలుకుంటాడు?'

'మొగుడిలో మార్పుకు భార్య అందమే కారణమైందని పాఠ కులు అనుకుంటె ఆ కథ ఫెయిలయినట్లే! భర్త పశ్చాత్తాప పడ్డాడనీ, తన పశ్చాత్తాపాన్ని ఆ విధంగా వెలిబుచ్చాడనీ నా ఉద్దేశం.' అన్నాడు కనకం.

'నేను కాదనటంలేదు. ఆ భార్య కురూపి అయితే నవ మన్మ థులు ఆవిడకోసం అలా ఎగబడతారా? ఆవిడ కాలుజారి తనను విడిచి పోయినాక ఆ కురూపికి భర్త క్షమాపణ చెప్పుకుంటాడా?' అని అడిగింది సరస్వతి.

'అడిగి ఉంటాడనే నా మనస్సులో నమ్మకం. ఇతరులు ఎగ బడటం మాట అంతగా చెప్పలేను. లోకంలో ఎక్కువ మందికి అంద మైన ఆడవాళ్ళిష్టమైతే అందుకు నేను జవాబుదారుకాను. నా కథకు మటుకు నేను జవాబుదారును'.

'అట్లా అయితే ఆవిడ అందగత్తె అన్నది అంత గుచ్చి గుచ్చి చెప్పకుండా ఉండవలసింది. ఆమె అందానికి ఏదో ప్రయోజనం ఉండాలి గద. లేకపోతే శిల్పం దెబ్బ తింటుంది.'

కనకం మాట్లాడలేదు. సరస్వతి ఓడించటం అతనికేమీ బాగా లేదు. కాని ఆమె చెప్పిన మాటల్లో కొంత నిజం ఉన్నదనటానికి సందేహంలేదు.

'ఇదే ఛాలెంజి: ఈసారి అనాకారి హీరోయిన్‌తో కథ రాస్తాను' అన్నాడతను.

'కొంపదీసి అనాకారి అనకండి — పాఠకులకు జుగుప్స కలగొచ్చు. అందం గురించి ఏమీ అనకుండా వదిలెయ్యండి.'

'ఎందుకు వదిలెయ్యాలి? అనాకారి అని గట్టిగా చెబుతాను.' అన్నాడు కనకం దర్పంగా. అతను అంతకుమునుపు పూర్తిచేసిన కథలో కూడా హీరోయిన్ అందగత్తె నన్నది జ్ఞాపకం వచ్చింది. అతనికి కొద్దిగా సిగ్గేసింది.

'ఆ కథ చదవాలని ఉంది త్వరగా రాయండి. దాంతో నేను కూడా మీ అభిమానుల్లో చేరిపోతానేమో!' అంటూ సరస్వతి లేచింది.

'అప్పుడే? ఇంకా ఏడు కాలేదు!' అన్నా డతను.

'నేను ఇంటికి పోయి ఎనిమిది మందికి వంట చెయ్యాలి ... మళ్ళీ మీరు మా ఇంటికేసి రాలేదు. శలవు రోజుగా చూసిరండి?' అంటూ అతని పక్కనుంచి కూరల సంచీ తీసుకున్నది.

'నాతో ఒకకప్పు కాఫీ తాగరాదూ?' అన్నాడు కనకం.

'పదండి.' అన్న దామె.

ఇద్దరూ ఫామిలీస్ గదిలోచేరి కాఫీ ఆర్డరిచ్చాక సరస్వతి బల్లమీదికి వంగి 'నా విమర్శను సీరియస్‌గా తీసుకోకండి. ప్రపంచమంతటా కమ్యూనిజం వచ్చినా స్త్రీల యుగం ఆరంభంకాదు. స్త్రీల ఆధిక్యత మాటకాదు. మగవాళ్ళూ, ఆడవాళ్ళూ ఒకే స్థాయిలోకి రావటం మాటే చెబుతాను. రేపో ఎల్లుండో కమ్యూనిజంలోకి అడుగుపెడుతున్నామనే రష్యనులు చూడండి. ఎంతసేపూ సాహిత్యంలో హీరో గురించి మాట్లాడతారు. హీరోయిన్ ప్రసక్తే లేదు... అందుచేత నేమిటంటే, మీరు నాతో పంతంపట్టి అనాకారి హీరోయిన్ కథమాత్రం రాయకండి' అన్నది.

'రాస్తానేమోనని భయమల్లే ఉందే?' అన్నాడు కనకం పుట్టెడు ఆత్మ విశ్వాసంతో కూచుంటూ.

'భయమేగాని— రాయలేరని, రాస్తారని కాదు' అన్నది సరస్వతి నిటూరుగా కూచుంటూ.

సర్వరు కాఫీ తెచ్చాడు.

5

అగ్రహారపు హీరోయిన్‌తో కథ రాయటం అనుకున్నంత తేలికగా కనిపించలేదు కనకానికి. మొదట్లో అయోమయంగా — ఇదొక బ్రహ్మాండమా అన్నట్టు—ఆలోచించాడు. తరవాత దీక్షగా ఆలోచించటానికి యత్నించాడు. కాని ఆలోచన సాగలేదు. ఎవరిచేతనైనా ఇష్టంలేని పని చేయించవచ్చు గాని మనసుచేత చేయించలేం. చెట్లమీదుగా వెళ్ళే కోతి ఒక కొమ్మనుంచి ఇంకో కొమ్మకు వెళ్ళినట్టుగా మనసు తనకు నచ్చని ఆలోచన వదిలేసి చల్లగా ఇంకో ఆలోచనను పట్టుకుంటుంది.

మళ్ళా రెండు వారాల అనంతరం అతను పానగల్ పార్కులో కూచుని ఉండగా సరస్వతి ఇంకో ఆవిడను వెంటబెట్టుకుని అక్కడికి వచ్చింది. రెండో ఆమెకూడా సరస్వతి వయసుదే. అరవావిడ. కొద్దిగా ఎం. ఎస్. సుబ్బులక్ష్మి టైపు. సరస్వతి కన్న చాలా రట్లు కుదురైన మొహమే అయినా కనకం కళ్ళకు సరస్వతి మొహంలోనే చురుకెక్కువ కనిపించి ఆశ్చర్యం కలిగింది.

సరస్వతి ఆమెను పరిచయం చేస్తూ, 'సుందరీ సత్యనాథన్. వీళ్ళ నాన్నగారు మన జిల్లాలో చాలా ఏళ్ళున్నారు. తెలుగు దేశపు బళ్ళల్లో చదువుకున్నది. తెలుగు బాగా వచ్చు. తమిళం సంగతి చెప్పనే అక్కర్లేదు. ఈవిడ వ్యాసాలు చాలా తమిళ పత్రికల్లో పడతాయి. మీ కథల్లో తనకు నచ్చినవాటిని అరవంలోకి అనువదించమని సలహా యిచ్చాను' అన్నది.

తాను కనకం రాసిన కథ ఒకటి చదివాననీ, బాగున్నదనీ, తమిళులకు అటువంటి కథలైతే నచ్చుతాయనీ చెప్పి 'మీ కథల కట్టింగులన్నీ వుంటే యియ్యండి' అన్నది.

'మీ ఎడ్రసివ్వండి. పంపిస్తాను' అన్నాడు కనకం.

'ఈ పక్కనే కోట్స్ రోడ్డులో' అంటూ సుందరి యింటినంబరు చెప్పింది.

'అలా చెప్పండి. నేను ఆ వెనుకవీధిలోనే వుంటున్నాను. నేనే తెచ్చి మీ యింటిదగ్గర యిస్తాను' అన్నాడు కనకం.

'చెయ్యండి' అన్నది సుందరి.

'ఇక నేను వెళ్ళాలి. ఇంకా కూరలు తీసుకోలేదు' అంటూ సరస్వతి లేచింది.

సుందరికూడా ఆమె వెంట వెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడామె సుందరి వెనకగా నిలబడి, వెళ్ళొస్తా నన్నట్టు కళ్ళు, తలా ఎగరేసింది. అందులోవున్న ఆత్మీయతకు అర్థం తెలుసుకుంటే బాగుంటుందనిపించింది కనకానికి. పది నిమిషాల తరువాత యిద్దరూ మళ్ళీ అటుగానే వచ్చారు.

'సరసూని బస్సెక్కిద్దాం రండి' అన్నది సుందరి కనకంతో, ఎంతో చనువున్నదానిలాగా.

ముగ్గురూ బస్‌స్టాండు దగ్గిరకి వచ్చారు. త్వరలోనే 13 నంబరు బస్ వచ్చి సరస్వతిని ఎగరేసుకు పోయింది.

"మనం ఒకపని చెయ్యగూడదూ ? ఏడే అయింది. నేను మీ వెంట వచ్చి మీ కథలు తీసుకుంటాను" అన్నది సుందరి.

"ఐతే పోదాం. ఆడది అడుగుపెడితే బ్రహ్మచారి గదికి కళ వస్తుంది."

"తమాషాగా మాట్లాడతారండీ మీరూ !"

తెలుగు కథలు తమిళంలోకి తర్జుమా చేసి పత్రికలలో వేయించటంలోగల ఒక చిక్కు ఏమిటో సుందరి అతనికి దారిలో వివరించింది. కథ తెలుగువాడు రాసినట్టు పత్రికలకి తెలియగూడదు. పాత్రల పేర్లూ తమిళ దేశానికి సంబంధించినట్లుగా మార్చటం అవసరం.

"ఇందుకు మీ కేమీ అభ్యంతరం లేదుగద ?" అన్నది సుందరి.

"మీరేం చేసినా నా కభ్యంతరం లేదు" అన్నాడు కనకం.

తన ఘోటక బ్రహ్మచారి జీవితంలో కనకం చాలామంది ఆడ వాళ్ళకు ఎరలువేసి కొందరిని చిక్కించుకున్నాడుగాని సుందరి అంత దులువుగా చిక్కిన చేప అతనికి జ్ఞాపకం రావటంలేదు. ఒక అరగంట వుండి, కటింగులు పట్టుకుని వెళ్ళిపోయాక కనకానికి పెద్ద సందేహం వచ్చింది. చేప ఎవరు ? ఎరవేసిన దెవరు ? ... ...

రెండు రోజుల అనంతరం సరస్వతి ఉత్తరం రాసింది.

... ... మీ కొత్త కథ యివాళే చదివాను. అందులోకూడా అందమైన హీరోయిన్ వున్నందుకు చాలా సంతోషం ... ... సుందరి కటింగులు తీసుకున్న దనుకుంటాను. మీరు తరవాత నిరాశపడకుండా ముందుగానే ఒక విషయం చెప్పాలి. సుందరి యిదివరకు చాలా తెలుగుకథలు "తస్కరించి" తన పేర తమిళ పత్రికలో అచ్చేసుకున్నది.

తెలుగు పత్రికలకన్న తమిళ పత్రికలు హెచ్చు డబ్బిస్తాయని బహుశా మీకు తెలిసే ఉంటుంది. ఆమెకు అదే సంపాదన... ...మా అన్నయ్యకు ట్రాన్స్‌ఫర్ అయేటట్టున్నది. అయేట్టయితే నేను ఇల్లు ఖాళీ చేసి ఏ హాస్టలుకో మారాలి. వీలు చూసుకుని పై ఆదివారం మా ఇంటి కేసి రండి...'

ఇంకేం? సుందరి అందుకే మళ్ళీ మొహం చూపించలేదు. కథలు పుచ్చుకుని ప్రతిఫలం ముట్టజెప్పి వెళ్ళిపోయింది. కనకం కొద్దిగా మాత్రమే నిరాశపడ్డాడు. సుందరి హృదయాలు దొంగిలించగలది కాదు. ఆమె కాలాంటి ఉద్దేశం ఏ కోశానా లేదేమో కూడానూ. అతని ఎదురుగా నెత్తిన ఒక ప్రశ్నార్థకపు గుర్తు వేసుకుని నిలబడి ఉన్న మనిషి సరస్వతి—సుందరి కాదు. సరస్వతిని ఆవరించి ఉన్న సమస్య ఏమిటో, దాని బరువు తన కెందుకో కనకానికి స్పష్టంగా అర్థం కాలేదు.

అన్నట్టు ఆమె ఛాలెంజి అట్లాగే వుంది. తను ఆ కురూపి కథ రాయాలి... ఆలోచించటానికి వ్యవధి చిక్కకుండా వుంది.

సరస్వతి తన జీవితాని కింకేదో పరీక్ష పెట్టినట్టు కనకానికి అస్పష్టంగా తోచి కొద్దిపాటి ఆందోళన కలిగింది. పనిపెట్టుకుని నోటి వెంట ఆమె అనకపోవచ్చుగాని ఆమె తన జీవిత లక్ష్యాలనూ, నమ్మకాలనూ, రచనా విధానాన్నీ, ఛాలెంజి చేస్తున్నట్టే వున్నది. వాటిని ఏ విధంగా సమర్థించుకునేట్టు? అంటే వాటి సత్యాన్ని రుజువు చెయ్యటానికి ఏం చెయ్యాలి?

'నాన్సెన్స్! ఏమీ ఛాలెంజి లేదు. అంతా నా భ్రమే. అవకాశం యిస్తే మనలో వందమంది వంద తప్పులు చూడగలరు. వాళ్ళ కోసం మనం ఎక్కడ మారగలం? మన అంతరాత్మ ప్రబోధంవల్ల మనం మారాలి' అనుకున్నాడు కనకం.

కథకుడుగా కనకానికి ఏస్థానం వున్నదనుకున్నప్పటికీ అతని రచనలో "మారువేషం" లేదు. ఆ రచనలకు బురఖా లేదు.

రాయటం అతని జీవితంలో ఒక భాగం. అతని జీవితంతాలూకు రంగమంతా — దాని మంచి చెడ్డ సారం యావత్తూ — రచనల్లో విధిగా కలిసింది. అందుచేత అతను తన రచనలను గురించి అంటీ అంట నట్టుండేవాడుకాడు. అతని రచనలను విమర్శించటమంటే అతని జీవితాన్ని ఒకవిధంగా విమర్శించడమే.

సరస్వతి వేసిన ప్రశ్నను తర్జుమాచేస్తే "నన్ను గురించి కథ రాయగలవా?" అవుతుంది. ఆ ప్రశ్నకు సమాధానం ఏమిటి? తన జీవితంలో సరస్వతివంటి దానికి ఎటువంటి స్థానం ఉండేదీ తెలుసుకో గలిగిన మరుక్షణం కథ రాసెయ్యవచ్చు. ఆమెకు ఏస్థానమూ లేని పక్షంలో తాను "అల్ప సంఖ్యాక వర్గం" (అందమైన వాళ్ళు)పై ఆధారపడి రచన చేస్తున్నట్టు ఒప్పేసుకోవటం మంచిది.

సూర్యనారాయణ వాళ్ళింటికి ఆ సాయంకాలమే వెళదామను కున్నాడుగాని, కనకానికి సుందరి ఇవాళయినా వస్తుందేమోనని ఆశ పుట్టింది. ఏడుగంటలకల్లా తన గదికివచ్చి ఎనిమిదిన్నర దాకా దీపమైనా వెలిగించకుండా కూచున్నాడు. ఆ తరువాత ఇల్లు కదిలి సుందరి ఉండే రోడ్డు ఈ చివరనుంచి ఆ చివరకు నడిచాడు. ఆమె ఉండే ఇంట నాలు గైదు కుటుంబా లుంటున్నాయి. సుందరి జాడ కనిపించలేదు. కనకం తిన్నగా హొటల్‌కు వెళ్ళి భోజనం చేసి గదికి వెళ్ళి పడుకున్నాడు.

కాని అతనికి వెంటనే నిద్ర రాలేదు. నిద్ర రాకపోగా కథకు ఒకచిన్న పాయింటు అందింది. అదేమిటంటే — కాలమూ, కర్మమూ కలిసివచ్చి తానూ, సరస్వతీ ఏకాంతంగా ఒకచోటనే వుండటం జరిగితే తాను ఆమె స్త్రీత్వాన్ని ఎంతకాలం నిరోధించ గలడు? రెండురోజులో వారం రోజులో, పది రోజులో — ఏదో ఒక పరిమితి వుంటుంది; ఆపైన ఆత్మనిగ్రహం పనిచెయ్యదు. కనకం రాసిన ఒక కథలో

ఒకడు ఒకతెమీద్త తనకుగల ఏవగింపు తెలపటానికి "ఈ మనిషి నా వెంట వుంటే ఒక వారంపాటు నా శీలం నిలబెట్టుకో గలను" అంటాడు. కనకం ఆ వాక్యం ఆషామాషీకి రాసినదికాదు. అది అతని జీవిత సత్యం. అతనికి సౌందర్య పిపాస లేకపోలేదు. తన ప్రణయాలను సౌందర్య పిపాసతో ముడిపెట్టాలని అత నెన్నడూ ప్రయత్నించలేదు. ప్రయత్నించినా సాధ్యపడదు. శరీరంలోని అంత స్రావాల ప్రోద్బలంవల్ల, తత్కాలానికి అందుబాటులో ఉన్న కుబ్జ కూడా నవమోహిని అవుతుంది. ఈ నిజాన్ని నిరాకరించడంవల్ల మనిషి వున్నతు డవుతాడని కనకానికి ఏ కోశానా నమ్మకంలేదు.

ఆ మాటని కనకం స్వైర విహారాలు చెయ్యలేదు. తన అంత రాత్మయొక్క గౌరవ మర్యాదలు కాపాడటానికి అతను కొన్ని నియ మాలు పెట్టుకున్నాడు. అత నెన్నడూ స్నేహితుల భార్యలమీద మనసు పోనివ్వలేదు. సమాజంయొక్క నీతి కాంతి జీవిత మంతటా ప్రసరించదు. అందులోని నీడల్లో నీతినియమా లుండవు. సంఘాన్ని బాధించకుండా నీతిని వుల్లంఘించ దలచిన వాళ్ళు ఈ నీడలో చేరు తారు. డబ్బుగల వాళ్ళవెంట తిరగటంచేత కనకం అలాటి నీడపట్లు బాగా ఎరుగును.

ఇంతకూ కథాంశం—హీరో కురూపి అయిన హీరోయిన్‌తో ఒంటరిగా ఒక వారం గడపవలసి వస్తుంది. మొదట హీరో ఏ మాత్రమూ చలించడు. హీరోయిన్ అతని కొక మగ స్నేహితుడల్లేనే వుంటుంది. అతను క్రమంగా ఆమె గొంతులోనూ, ఆలోచనలోనూ, మాటలోనూ, చేష్టలోనూ ఆడతనం గమనించి ఒక అస్పష్టమైన ఆనందం అనుభ విస్తాడు. ఆఖరుదశలో అతనికి ఆమెలో దైహిక ఆకర్షణకూడా కని పించి అంతకంతకూ బలీయంగా పరిణమిస్తుంది... ... ... కాస్త కిటికీ లోంచి మలయమారుతం వదులు! దానివెంట నైట్ క్వీన్ ఘుమ

ఘుమలు చేర్చు!... ... ... మొత్తానికి కురూపిని గురించి కథ రాయటానికి పథకమంటూ చిక్కింది.

కనకం కళ్ళు మూసుకుని నిశ్చితంగా నిద్రపోయాడు.

6

మర్నాడు ఎనిమిదిన్నరకు కనకం ఇడ్లీ-కాఫీలపని ముగించుకుని బస్సెక్కి సూర్యనారాయణ యింటికి వెళ్ళాడు. అతన్ని చూస్తూనే జయలక్ష్మి 'ఏవండోయ్! మీకు మేనల్లుడు కలిగాడు' అన్నది గొప్ప శుభవార్త చెబుతున్నట్టుగా.

ఆ వార్త అర్థంకావటానికి కనకానికి పూర్తిగా అరనిమిషం పట్టింది.

'మా చిన్నక్కకి మొత్తం సంతానం ఎంతమంది?' అని అడిగాడు.

జయలక్ష్మి దవడలు నొక్కుకుని ఆశ్చర్యపోతూంటే సరస్వతి చిరునవ్వు నవ్వింది. సూర్యనారాయణ రాయల్లే వుండిపోయాడు. అతను మాట మార్చటానికల్లే, 'అన్నట్లు నాకు ట్రాన్స్‌ఫరయ్యేట్టువుంది. ఇక్కడినుంచి కదలకుండా వుండటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాను. ట్రాన్స్‌ఫర్‌తోబాటు ఇంక్రిమెంటూ, అప్‌గ్రేడింగూ వున్నదనుకోండి. అయినా మా సరస్వతి ఒంటరిదైపోతుంది. మేం విడిగా యింతవరకు వుండలేదుమరి' అన్నాడు.

కనకానికి అకస్మాత్తుగా ఎరగని చోటికి వచ్చిన భావం కలిగింది. ఈ సూర్యనారాయణ తనతో స్వవిషయా లెందుకు చెబుతున్నాడు? అతని భార్య తనకు దగ్గిర బంధువుల్లే నటిస్తుం దెందుకు? అతని చెల్లెలు తనతో సాహిత్యపు సవాళ్ళు చేసే చనువు ఎట్లా సంపాదించుకుంది? వీళ్ళకు తను మనసివ్వలేదు. సూర్యనారాయణ కనీసం తన అభిమాని—ఫాన్. అయినా అతను తన రచనల గురించి ఒక్క ముక్క మాట్లాడలేదు. అతనిది ఒక రకం మూగ ఆరాధన లాగుంది. తప్పో, ఒప్పో. తన కథలు గురించి సరస్వతే కొన్ని అభ్యంతరాలు లేవదీసింది. వాటిని కొట్టి పారెయ్యటానికి కూడా లేదు. తాత్వికంగా చూస్తే ఆ లోపాల వేళ్ళు తన స్వభావంలోనూ, జీవితంలోనూ కూడా వుండవచ్చు. ఇది కనకాన్ని సన్నగా తొలుస్తున్న భయం. అతను కథలు రాస్తున్నాడంటే ఆ రాయటం వెంబడి కొంత ఆత్మ సంతృప్తి—కాంప్లెసెన్స్—లేకపోలేదు. అందులో ఆత్మ వంచన ఏమైనా ఉన్నదా? అవకాశం తీసుకుని తరిచి అడిగితే సరస్వతి తనలోని లోపాలను మరింత బాగా వివరించ గలుగుతుందా!

"ఆ తెలుగు - అరవావిడకి కథ లిచ్చేశాను. ఏం చేసుకున్నా నా కేమీ అభ్యంతరం లేదు... ఆవిడకి పెళ్ళీ పెటాకులూ లేవా?" అన్నాడు కనకం సరస్వతితో.

సరస్వతి నవ్వి, తల అడ్డంగా ఆడించింది.

"అయితే నేను బయలు దేరుతాను. మీ రిద్దరూ వుద్యోగాలు చేసుకోబోయే వాళ్ళు కద. తొమ్మిది దాటింది." అంటూ కనకం లేచి నిలబడి చేతి గడియారం చూసుకున్నాడు.

"నాకు మధ్యాహ్నం తరవాతనే పని కూచోండి. కాఫీ అయినా తాగకుండా ఎలా వెళతారు?" అన్నది సరస్వతి.

"ఇదేనా నీ ఆతిథ్యం? భోజనానికి ఉండమనక కాఫీయా ఇస్తున్నావు?" అంటూ సూర్యనారాయణ లేచి నిలబడి, నేను వెళ్ళి

అన్నం తినేస్తాను. మీరు సరస్వతితో మాట్లాడుతూండండి.' అన్నాడు.

ఇద్దరూ బయటి వరండాలో దిగబడి పోయారు.

ఈ ట్రాన్స్ఫర్ మా అన్నయ్యకి ఆర్థికంగా దెబ్బ. ఇక్కడ ఇద్దరి సంపాదనా కలబోసుకుని కాలక్షేపం చేస్తున్నాం. కావలిస్తే నేను నెల నెలా కొంత డబ్బు పంపుతా నన్నాను. పంపినా డబ్బు నష్టం ఉండనే ఉంటుంది. నేను వీళ్ళతో ఉంటే నా కింద నెలకో యాభై అయేను, విడిగా ఉంటే కనీసం వంద ఖర్చుకాక తప్పదు.' అన్నది సరస్వతి.

కనకానికి డబ్బుగురించి యింత వివరంగా ఆలోచించే అలవాటు లేదు. కాని, వాళ్ళిద్దరి సంపాదనా చేరి యే ఐదువందలో వుంటుందనుకుంటే అందులో యాభై పెద్దమొత్తమేనని అతను అనుకున్నాడు.

'మా వదినె పెద్ద చిక్కులో పడిపోయింది. ఆవిడకి నా సంపాదన కావాలిగాని నే నక్కర్లేదు, నేను చదువుకునేరోజుల్లో చాలా సూటిపోటిమాట లనేది. ఉద్యోగం వచ్చినాక కాస్త తగ్గింది' అన్నది సరస్వతి చిన్నగా.

'మీ అన్నయ్య వూరుకుంటాడా?' అన్నాడు కనకం, తను కూడా రహస్యంగా మాట్లాడుతూ.

'పెళ్ళినాడే నల్లపూసల మధ్య మా అన్నయ్యనుకూడా గుచ్చి మెడలో వేసుకున్నది. ఆడదానికి మగాళ్ళుగాని, ఆడవాళ్ళుగాని అంత హీనంగా ఎందుకు లొంగిపోతారో ... ... మరే విధంగా చూసినా మా అన్నయ్య యోగ్యుడు ... ... ఇటువంటి దాస్యం ప్రేమగా చలామణీ అవుతున్నది!'

'ఇది ప్రేమకాదు. వ్యామోహం.'

"అనటానికి మన మెవరం ? మా అన్నయ్య నడగండి—ప్రేమే నంటాడు."

"అందానికి కట్టుపడ్డాడేమో ?"

"అందమంటే మొహానే వుండాలిటండీ ? ఇల్లంతా నేను పొద్దునా సాయంకాలమూ సర్దుతాను. ఎక్కడ పడేసిన వస్తువు అక్కడే రోజుకు తొంభైసార్లు చూసుకునే అద్దంమీద కుంకమూ, పౌడరూ, నూనెమరకలూ చేస్తుంది. తుడుచుకోవాలని కూడా తెలీదు. చూసి నేర్చుకోదు. మా అన్నయ్య నిజంగా ఏలూరు బదిలీ అయి వెళ్ళి అక్కడ కాపరం పెట్టాడో, రెండు రోజుల్లో ఇల్లు గొడ్లపాక కన్న హీనంగా తయారవుతుంది ! ... ... నా మాదిరిగానే మా అన్నయ్యక్కూడా ఇల్లు చక్కగా ఉండాలి. కళ్ళంలాగుంటే భరించలేడు ... ... పిలుస్తున్నారు. కాఫీ రెడీ అయింది లాగుంది" అంటూ సరస్వతి లోపలికి వెళ్ళింది.

సరస్వతి జయలక్ష్మిని గురించి చెప్పిన మాటలు నిజంకాక పోవచ్చుననిగాని, అందులో అతిశయోక్తులుండ వచ్చుననిగాని కనకానికి ఏ మాత్రమూ అనిపించలేదు. తనతో అబద్ధాలు చెప్పటంవల్ల ఆమెకు ఒరిగేదేమీలేదు. అసలు తనతో ఆ విషయం చెప్పటమే వింత. సరస్వతి మాటలు కనకానికి నిజంగా తోచటానికి అసలు కారణం సరస్వతి స్వభావమే. ఆమె తన కథలను తప్పు పట్టినప్పుడు కూడా చెప్పదలచుకున్న దానికంటె తక్కువే చెప్పిందిగాని ఒకరి తప్పును ప్రచారం చెయ్యటంలో తనకు ఆనందం ఉన్నదానిలాగా మాట్లాడలేదు,

ఆమె చెప్పిన రెండు ముక్కలను బట్టే సరస్వతి ఎంతఒంటరి జీవితం జీవిస్తున్నదో ఎంత ఓర్పుతో సహిస్తున్నదో ఊహించటానికి కనకం ప్రయత్నించాడు. పిల్లలంటే ఇష్టం ఉండికూడా పెళ్ళి చేసుకో కూడదని నిశ్చయించు కున్నదంటే తనకు భవిష్యత్తులోకూడా ఏ ఆనందమూ లెకుండా చేసుకుంటున్నదన్నమాట! ముసలిది కాదు.

ముతకది కాదు— భవిష్యత్తుపైన ఎన్ని ఆశలైనా ఉండవచ్చు! తన జీవితాన్ని ఏం చెయ్యదలుచుకున్నదీ తెలుసుకుంటే బాగుండును.

సరస్వతి కాఫీ రెండు కప్పుల్లో తెచ్చింది, ఒకటి కనకానికిచ్చి రెండోది తాను తీసుకుని అతని కెదురుగా కూచున్నది.

"ఆ కథ…" అన్నాడు కనకం. "అది మనం పార్కులో కలును కోక మునుపే రాశాను. మనం మాట్లాడుకున్నాక ఇంకా కథ రాయ లేదు. ఆలోచిస్తున్నాను."

"ఓ. నా ప్రశ్నలకి సమాధానం చెబుతున్నారా? నేను చెయ్యి ఊరుకోక రాశాను. పోనివ్వండి. నన్ను మీరు సీరియస్‌గా తీసుకుంటే డిజప్పాయింటవుతారు" అన్నది సరస్వతి.

"ఊరికే విషయం చెప్పాను. అందమైన హీరోయిన్ లేకుండా నేను కథ రాయలేదన్నది అబద్ధం కాదుగద? అట్లా ఎందుకు చేస్తు న్నానాఅని ఆలోచిస్తున్నాను. కారణం మంచిదైతే నా పద్ధతి మార్చు కోను. మంచిది కాకపోతే తప్పక మార్చుకుంటాను. ఈ విషయం నా దృష్టికి తెచ్చినందుకు నేను మిమ్మల్ని థాంక్ చెయ్యాలి."

"లోకంలో లేని విషయం మీరు చెయ్యటంలేదు. ఈనాటి సమాజంలో ప్రయోజకుడైన మగవాడంటే ఆర్జించగలవాడు. ప్రయో జకురాలంటే అందంగావుండే ఆడది. నే చెప్పేదీ, అందం కాకపోతే దాని స్థానంలో ఇంకో క్వాలిటీ వస్తుంది. ఏ ప్రత్యేకతా లేని వాళ్ళకు కళలో స్థానం ఉండటం కష్టం. వాళ్ళలో గొప్పతనం వుండాలి లేదా వాళ్ళు ఒక గొప్పపని చెయ్యాలి. మామూలు మనుషులు ఎక్‌స్ట్రాలుగా కూడా పనికిరారు".

కాఫీ తాగేసి కప్పు కిందపెడుతూ కనకం "నా హీరోయిన్ లందరూ అందంగానే ఎందుకుండాలి? వాళ్ళలో ఇంకో గొప్పతనం

ఎందుకుండరాదూ? గొప్ప ఆటగత్తో, పాటగత్తో" అంటూ ఆలోచనలో పడ్డాడు.

"మన తెలుగు కథల్లో వృత్తి విద్యలుగల ఆడవాళ్ళు హీరోయిన్‌లుగా పనికి రారేమో. ఈ నిర్బంధం మగవాళ్ళకు లేదు. మీ హీరోలు చూడండి– వాళ్ళ అందం అంతగా లేనివాళ్ళుకూడా వున్నారు... చూశారా? మళ్ళా వాగేస్తున్నాను నన్ను దయచేసి మీరు సీరియస్‌గా తీసుకోకండి."

"నిజం నాకు కాంప్లిమెంటరీగా ఉండాలని నాకులేదు. నిజమైతే నాకు అనుకూలంగా వున్న విషయాలైనా వింటాను. నేనేమనుకుని పోతానో అని నోరుకట్టేసుకోవద్దు" అన్నాడు కనకం.

లోపలినుంచి ఫైటర్ విమానాలల్లే పందెం వేసుకుని పరుగెత్తుకుంటూ పిల్లలిద్దరూ వచ్చి సరస్వతిమీద పడ్డారు. ఇద్దరి చేతులూ, మూతులూ తడిగా వున్నాయి. అప్పుడే అన్నం తిన్నట్టున్నారు. సరస్వతి పమిటచెంగు చెరొక మూలా పట్టుకుని మూతులు తుడుచుకున్నారు.

ప్రపంచంలో అమ్మకన్న అందగత్తె ఉండదుట. ఈ ఇద్దరు పిల్లల్నీ అడిగితే ప్రపంచంలోకల్లా సరస్వతే అందగత్తె అంటారు కాబోలనుకున్నాడు కనకం పిల్లల చేష్టలు సూక్ష్మంగా గమనిస్తూ. వాళ్ళు సరస్వతిమీదికి ఎక్కటానికి యత్నించారు. కొండలెక్కే వాళ్ళు దొరికిన రాళ్ళనూ, చెట్లనూ పట్టుకున్నట్టు ఆమె బుజాలూ, జుట్టూ, తలా ఉపయోగించుకున్నారు.

సరస్వతి వాళ్ళను చెరొక దెబ్బవేసిన తరవాత కుదురుగా కూర్చున్నారు.

"అమ్మా, నాన్నా ఊరికెళ్ళి పొయ్యేదెప్పుడు?" అని అడిగింది ఆడపిల్ల.

"ఏమో, ఏం తొందర ?" అని సరస్వతి అడిగింది.

"నాకు రైలెక్కా లనుంది." అన్నాడు కుర్రాడు.

"నువు వెళ్ళనంటివే ?" అని సరస్వతి అన్నది.

"మనం రైలెక్కి ఇంకో వూరు పోదాం అంతగా అయితే." అన్నది ఆడపిల్ల.

"కాదు. అందరం కలసి పోదాం. నువు కూడారా !" అంటూ కుర్రాడు, అప్పుడే బయలుదేరే వాడల్లే సరస్వతిని చెయ్యి పట్టుకు గుంజ నారంభించాడు.

"నీకు వెళ్ళాలనుంటే అమ్మతో నాన్నతో నువ్వెళ్ళు. నేనూ, అత్తా యిక్కడే వుంటాం హాయిగా !" అన్నది పిల్ల.

కొంచెంసేపు కూచుని కనకం వస్తానని సరస్వతికి చెప్పి బయలుదేరాడు.

7

క్రనకానికి కొన్ని రకాల సన్నివేశాలు సరిపడవు. వాటిని తప్పించుకుని తిరగటం అలవాటు చేసుకున్నాడు. పెళ్ళిళ్ళ అప్పగింతలు చిన్న తనంలోనే అతనికి భయంకర మనిపించింది. వేదాంతులు చెప్పినట్లు అన్ని బంధాలూ బాధాకరమైనవే. కాని ఆ బంధాల్లోనే మానవులకు తృప్తి ఆనందమూ వుండటంచేత మనుషులు వాటిని తెంచుకోరు. తల్లీ-బిడ్డలూ, భార్యా - భర్తా, ఈ బంధాలు సాహిత్యంలోనూ, సినిమా



ల్లోనూ మరీ గాఢంగా చూపిస్తారు. అందుచేత వాటివల్ల కలిగే బాధ మరింత దుర్భరంగా వుంటుంది. జీవితంలో యీ బంధాలు మిశ్రమంగా వుంటాయి. కూతురి అప్పగింతలకు బావురుమని ఏడిచే తల్లి కూతురిని అస్తమానం ముద్దు చెయ్యలేదనీ. ఎప్పుడో ఒకప్పుడు, ఎందుకో అందుకు పెట్టవలసిన శాపనార్థాలు పెట్టి వుంటుందని మనం వూహించ

వచ్చు. అట్లాగే భర్తపోతే ఏడిచే భార్య, భర్తే లోకంగా జీవించలేదని అనుకోవచ్చు. ఐనాకూడా యీ బాధలు దుర్భరమైనవి. ఇటువంటి బాధలు ఎరగకుండా దాటిపోయేవాళ్ళే నిజమైన అదృష్టవంతులని అతనికి గట్టి నమ్మకం.

అటువంటప్పుడు అతను, సూర్యనారాయణ భార్యాబిడ్డలతో రైలెక్కుతుంటే సాగనంపటానికి వెళ్ళకుండా వుండవలసింది. సూర్య నారాయణ కూతురు అంత ఏడుపు ఏడుస్తుందని అతనికి ముందుగా ఏం తెలుసు! ఆ పిల్ల సరస్వతిని వెనకవేసుకుని వెళ్ళనంటే వెళ్ళనన్నది.

"శలవు లివ్వగానే నేనూ వస్తానే పిచ్చిదానా! ముందుగా వెళ్ళి నువ్వు ఆ వూరంతా చూడు. నేను వచ్చాక నాక్కూడా చూపిద్దువు గాని!" అని సరస్వతి ఆ పిల్లను సముదాయించ యత్నించింది.

"నువ్వు అబద్ధం ఆడుతున్నావు! నువు రావు!" అన్నదా పిల్ల.

ఆ పిల్ల పట్టుదల సరస్వతిని ఎంత బాధిస్తున్నదీ కనకానికి అర్థ మయింది. సరస్వతి తన వికారాలను పైకి ఏ మాత్రమూ కనబరిచే మనిషి కాదుకూడానూ. "రైలు త్వరగా బయలుదేరగూడదా ?" అను కున్నాడు కనకం—సరస్వతికోసం.

చివరకు రైలు వెళ్ళిపోయింది. సూర్యనారాయణ పిల్లలిద్దరూ కిటికీ దగ్గిర కూచుని సరస్వతికేసి చాలాసేపు చేతులూపారు. సరస్వతి చేతిలో రుమాలు ఎత్తిపట్టుకుని ఊపింది. చిట్ట చివరకు సరస్వతీ, తానూ వెనక్కు తిరిగినప్పుడు కనకానికి ఒక పెద్ద ధర్మ సందేహం పట్టుకున్నది. ఈ ఆపేక్షలు అనివార్యమా? ఆ పిల్ల సరస్వతిని వాటేసు కుని ఏడ్చినప్పుడు, తన నరాలన్నీ బిగదీసుకుపోయి ఉన్నప్పు డతనికి ఈ తాత్విక దృష్టి కలగలేదు. ఆపేక్షలూ, బాధలూకూడా అని వార్యాలే అనిపించాయి. వాటిని అనుభవించక తప్పేది లేదని పించింది. ఇప్పు డతని వెంట తల వంచుకుని నడుస్తున్న సరస్వతి మొహాన్ని పక్కగా చూసి అతను, "పిల్లల్ని తెగమాలిమిచేసి తాను

బాధపడి వాళ్ళను బాధ పెట్టింది. ప్రేమలో క్రౌర్యం వుంది... కాని ఈ మనిషి క్రూరమైనదంటే ఎవరూ నమ్మరు!' అనుకున్నాడు.

కనకానికి ఇంకొక వైపరీత్యం స్ఫురించింది—ప్రేమలో విశ్వాసం ఉన్నవా డతను. లేని మనిషి సరస్వతి. తమ పాత్రలు ఎప్పుడు మార్పు చెందినట్లు? నిజానికి తాను ప్రేమ అనుకున్నది స్త్రీ పురుష ప్రణయ ప్రేమ సరస్వతికి అందులో నమ్మకంలేదు. కాని ఆమెకు ఇతర ప్రేమలలో నమ్మకం ఉన్నట్టున్నది. తాను వాటినుంచి ఏనాడో విముక్తి పొందాడు. తానైతే సరస్వతి ఉన్న పరిస్థితిలో ఒక్కక్షణం కూడా సూర్యనారాయణ ఇంట ఉండడు.

'ఇప్పుడెక్కడికి? ఇంటికేనా?' అని అడిగాడు కనకం.

'ఎక్కడికి వెళ్ళినా ఫరవాలేదు ఇంకా రెండు రోజుల వ్యవధి ఉంది ఇల్లు ఖాళీ చెయ్యటానికి. వై డబ్ల్యూ సీ ఏ కు పోదామా అను కుంటున్నాను.'

'ఇంటికి వెళ్ళితే మాత్రం ఏముంది? బావురుమంటుంది. మా ఇంటికి రాగూడదూ నేను మీ యింటి కెన్నిసార్లొచ్చాను. మీరు మా యింటికి రాలేదు.'

'పోదాం పదండి.'

ఇద్దరూ సెంట్రల్ నుంచి టాక్సీలో బయలుదేరారు.

'ఆ పిల్లల్ని అంతగా ముద్దు చెయ్యకుండా ఉండవలసిం దేమో?' అన్నాడు కనకం.

'పిల్లలకి ఆహారం ఎంత అవసరమో అపేక్షలంత అవసరం. మా వదినెకు చేతకాదు. మా అన్నయ్యకి బిడియం. మరీ గోపాలు గాణ్ణి ఇద్దరూ వదిలేసి ఊరుకున్నారు. మా వదినెకు పిల్లల ఉచ్చా, దొడ్డి అంటేనే పడదు. ఎక్కడి కన్నా బయలుదేరేటప్పుడు పిల్లల

నెత్తుకుంటే చీరె నలుగుతుందని గునిసేది. మా అన్నయ్య ఎప్పుడైనా పిల్లల్ని దగ్గరకి తీస్తే, వాళ్ళను దిక్కుమాలిన అలవాట్లన్నీ నేర్పి పాడు చెయ్యొద్దనేది. అది నా మీద విసురు!" అన్నది సరస్వతి.

"మా భవానీ ప్రసాదు పిల్లలు నా దగ్గరకి ఎప్పుడూరారు. వాళ్ళు ఎవరి అపేక్షతో బతుకుతున్నారో తెలీదు." అన్నాడు కనకం.

భవానీప్రసాదు భార్య మందాకినీదేవి సరస్వతికి ఆప్యాయంగా స్వాగత మిచ్చింది. ఫ్రిజిడేర్‌లోనుంచి రాస్ప్‌బరీ జూస్ సీసా తీసి డ్రింకు తయారు చేసింది. బిస్కట్లు ప్లేట్లలో అమర్చింది. "సురేష్", "కుమార్" అని పిలవగానే యిద్దరు పిల్లలు ఏడేళ్ళవాడూ, ఐదేళ్ళవాడూ పైనుంచి దిగివచ్చారు. కుమార్ కనకంకేసి చూసి ఒక పక్కన చిరునవ్వు నవ్వాడు.

కనకం మందాకినీదేవికి సరస్వతి పరిస్థితి సంగ్రహంగా చెప్పాడు.

"ఇంట్లో పిల్లలు లేకపోతే తోచదు. నా కలాగే వుంటుంది" అన్న దావిడ. కాని అది లాంఛనంగా అంటున్న మాటల్లేనే ధ్వనించింది.

సరస్వతి వేరే చోటు చూసుకోవటంగురించి ఆవిడ "పదో తేదీన మేం బొంబాయి పోతున్నాం; రెండు నెల్లదాకా రాం. మీ కభ్యంతరం లేకపోతే మీ రిక్కడే వుండొచ్చు. పనిమనుషు లిద్దరూ వుంటారు. ఏమీ యిబ్బంది వుండదు" అన్నది.

"ఎందుకు లెండి? నేను యీ నెలాఖరులోపుగానే ఖాళీ చెయ్యాలి. మధ్యలో పదిరోజులు ఎక్కడుంటానూ?" అన్నది సరస్వతి.

మందాకినీదేవి నవ్వి "ఇల్లు పెద్దదిలెండి. మేముండగానే మీరుండవచ్చు. కనకంగా రుంటున్నారుకారా? ఈ పక్కగది లాయనవి.

ఆయన ఎప్పుడొచ్చేదీ, ఎప్పుడు పోయేదీకూడా మాకు తెలియదు. అలాగే మీక్కూడా ఎవరితోనూ సంబంధంలేకుండా రెండు గదులు ఏర్పాటు చెయ్యగలం. నా పెళ్ళి అయేనాటికి యీ యింట్లో చిన్నా పెద్దా కలిసి పదిహేనుమంది వుండేవాళ్ళు. అప్పుడిల్లు కళకళలాడేది. ఇప్పుడంతే బిక్కు బిక్కు మంటున్నదిగాని' అన్నది.

సరస్వతి తనకేసి చూస్తుందేమో! సరే ననమని సంజ్ఞ చేద్దామనుకున్నాడు కనకం. కాని, సరస్వతి నేలకేసీ, మందాకినికేసీ మాత్రమే చూస్తున్నది. మందాకిని అదొకరకం మనిషి. సరస్వతి తమ యింటికి రాకపోయినా బాధపడదుగాని, వస్తానని అనకపోతే బాధ పడుతోంది. వాళ్ళవన్నీ అవోతరహా మర్యాదలు. ఆవిడ సరస్వతికి చేసే మర్యాదలన్నీ పరోక్షంగా కనకానికే—అతనిమీద తమకుగల మమత్వాన్ని సరస్వతికి తెలియబరచటానికే. సరస్వతిని తమ యింటికి వచ్చి వుండమనటంకూడా అటువంటిదే. 'మీ యిద్దరూ స్నేహితులు గదా? ఒకేచోట వుండటం మీకు బాగుండేపక్షంలో ఆ అవకాశం నేనిస్తాను' అని మందాకిని మాటల అంతరార్థం. సరస్వతికూడా తమ అంతరంగికులలో చేరాక ఆమె వెంట వచ్చేవారికి యిలాటి సత్కారాలే జరుగుతాయి. వాళ్ళ ప్రపంచం యీవిధంగా విస్తరిస్తుంది.

'థాంక్స్. చూద్దాంలెండి ఇవాళ నేనా విషయం ఆలోచించే స్థితిలో లేను' అన్నది సరస్వతి.

'నాకు తెలుసు. మీరు పిల్లల్ని మిస్ చేస్తున్నారు. నేనైనా అంతే' అన్నది మందాకిని.

8

"ఇదా మీ గది ?" అన్నది సరస్వతి కనకం ఉండేగదిని కలయ జూస్తూ "పెద్దదే. బాగానే అరేంజి చేసుకున్నారు."

"ఆ తలుపు వెనకే బాత్‌రూం. ఈ తలుపు వెనక చిన్న వరండా ఉంది."

సరస్వతి పుస్తకాల రాక్ దగ్గిరికి వెళ్ళి అతను చదివే పుస్తకాలేవో పరీక్షించింది. వాటిలో ఒకటీ ఆమె చదవలేదు. సరికొత్త రచయితలవై ఉండాలి. ఖరీదైనవి కూడానూ. ఒకటి రెండిటి అట్టలు తెరిచి చూస్తే వాటిమీద కనకం పేరు లేదు. ఇంకెవరెవరి పేర్లో ఉన్నాయి.

"అవన్నీ స్నేహితు లిచ్చినవే. నేనై పుస్తకాలు సామాన్యంగా కొనను."

"తెలుగు పుస్తకాలేమీ ఉన్నట్టు లేదే ?"

"ఇంటుర్నేషనలిజం నుంచి నేషనలిజంకు రావటం వెనకడుగేమో !" సరస్వతి నవ్వింది. ఆమె కళ్ళు బల్లమీదవున్న కాగితాల బొత్తిమీద పడ్డాయి. "కొత్త కథ ఏదో రాస్తున్నట్టున్నారే. చూడవచ్చా ?"

"పూర్తి కాలేదు. పూర్తి కాగానే ముందు మీరే చూడాలి. ఇది మన ఛాలెంజి కథ."

సరస్వతి కాగితాల బొత్తి తీసి మొదటి పేజీకోసం వెతికి "ఆమె

అనాకారిది' ఓ అనాకారి హీరోయిన్ కథా ? తప్పక చదువుతాను. ఇంకా రాయవలసింది చాలాఉందా ?" అని అడిగింది.

"లేదు కొంచమే. ముగింపు కోసం ఆలోచిస్తున్నాను."

"అయితే చదివేస్తాను ?" అన్నది సరస్వతి.

"చదవండి. చదివి ముగింపు చెబితే చాలా సంతోషిస్తాను అప్పుడిది మీరు కోరిన కథేకాక మీకునచ్చిన కథకూడా అవుతుంది."

సరస్వతి చదవటం అరంభించిన క్షణం నుంచీ కనకం రిజల్ట్స్ కోసం ఎదురుచూసే విద్యార్థిలాగా అయిపోయాడు. ఆమె మొహాన కలిగే ప్రతి సున్నితమైన మార్పూ అతని తలలో మీటరు ఆడిస్తున్నది. ఒకసారి ఆమె మొహం చిట్లించేది. ఇంకోసారి చిరునవ్వు నవ్వబోతు న్నట్టు కనబడేది.

కథలో పెద్ద విశేషమేమీలేదు. ఇద్దరు స్నేహితురాళ్ళు విప్ర నారాయణ సినిమా చూసివచ్చి, దేవదేవి నిజంగా అందగత్తె కావాలా అని చర్చించుకుంటారు. ఒంటరిగా దొరికిన మగవాణ్ణి ఎంత అనాకారి ఆడదైనా చెడగొట్టవచ్చు నంటుంది ఒకతె. ఆ తరవాత ఆ పిల్లా, అందగాడైన హీరో ఒక చోట ఏకాంతంగా తటస్థ పడతారు. వాళ్ళిద్దరూ నిర్జనమైనచోట ఏకాంతంగా చేరగలందులకు కనకం ఒక రైలు ప్రమాదమూ, ఒక ఉప్పెనా సృష్టించాడు. ఆ అనాకారిదాన్ని వారం రోజులపాటు "రెసిస్ట్" చేసిన హీరో ఒకరాత్రి రెసిస్ట్ చెయ్య లేక పోతాడు. అతను హీరోయిన్‌ని ఆలింగనం చేసుకుని, "ఏమిటో అనుకున్నాను. నీలో ఎంత ఆకర్షణ ఉందీ !" అంటాడు. అక్కడ కథ ఆగిపోయింది.

చివరి వాక్యం చదివి సరస్వతి కనకంకేసి ప్రశ్నార్థకంగా చూసింది.

"చదవటం పూర్తి అయిందా ?" అన్నాడతను.

'అయింది. మీ హీరోయిన్ — ఆఫ్టరాల్ — ఆకర్షణ గలది గానే కనిపిస్తుంది ?' అన్నది.

'లేదే ?'

'మీ హీరో అలా అంటాడేం ?'

'అతను చెప్పేది అందంగురించే అని ఎందుకనుకోవాలి ?' అన్నాడు కనకం.

సరస్వతి మాట్లాడలేదు. మాట్లాడే పక్షంలో ఆమె 'ఇంకే ఆకర్షణ ?' అని అడగాలి. అడిగితే బహుశా కనకం చెప్పలేడు. అందుకే ఆమె అడగలేదు.

'ఇంతకీ కథ ఎట్లా ముగిస్తే బాగుంటుందంటారు ?' అన్నాడు కనకం.

'మీ హీరోయిన్ పుస్తకాలు చదువుకున్నదైతే 'ఇది ప్రేమేనా? నన్ను పెళ్ళాడే ఉద్దేశం మీకున్నదా ?' అంటుంది. తన సుఖమే కోరుకున్నదైతే, మీ సుఖం కోసం ప్రాణాలైనా అర్పిస్తాను అంటుంది. పెడసరం మనిషైతే 'మీరింకా పెద్దమనిషి అనుకున్నాను. మీరూ అందరు మొగాళ్ళంటి వారేనే!' అంటుంది. వెకిలిదైతే, 'ఇదెప్పట్నుంచీ ? 'అంటుంది—'

కనకం సరస్వతికేసి కళ్ళు పెద్దవిచేసి చూశాడు. సరస్వతికి ఇంత లోకానుభవం ఎట్లా వచ్చింది ? ఈమె ఎటువంటి మనిషి ?

సరస్వతి అతన్ని చూసి విరగబడి నవ్వుతూ 'ఎందు కాశ్చర్య పడతారు ? మొదటివి పుస్తకాలలో చదివినవీ, చివరవి నా చెవులారా గోడవతలి నుంచి విన్నవీనూ' అన్నది.

'నా కథ మీకు నచ్చలేదన్నమాట ?'

'నా మాటకేమిటి ? మీకు నచ్చిందా ?'

"లేదు. నాకు అసహ్యం వేసింది. పళ్ళ బిగువున రాసుకుంటూ వచ్చాను."

"పూర్తి చెయ్యండి. ఇటువంటి కథలు నచ్చేవాళ్ళున్నారు. ఎటువంటి కథలైనా నచ్చేవాళ్ళున్నారు. చచ్చు కథ అనేది లేదు" అన్నది సరస్వతి.

కనకానికి ఒళ్ళంతా కారం రాచినట్టయింది. అతను పాపం! తన కీర్తిని తెగ మోసుకు తిరిగేవాడు కాదు. తెలుగు దేశంలో తన కన్న బాగా రాసేవాళ్ళెందరున్నారో, తనకన్న తక్కువగా రాసేవాళ్ళెందరున్నారో అంచనాలు కట్టటం అతనికి అలవాటు లేదు. సాధారణంగా తెలుగు కథలు చదివేవాడు కాదు—వాటి ప్రభావం తనపైన పడుతుందేమోనని భయం.

అయినా అతను కొంత ఆత్మ సంతృప్తితో ఉంటూ వచ్చాడు. సరస్వతి అడుగడుగునా అతన్ని నిరుత్సాహ పరుస్తూనే వచ్చింది. తనమీద ఆమె కెందుకు పగ? తన కథల్ని, శస్త్ర చికిత్స చేసేటప్పుడు తప్ప మిగతా సమయాలలో ఈ పగ చూపదేం?

క్షణాలమీద అతని బుర్ర నుడిగుండంలా అయిపోయింది. అతను తనకే ఆశ్చర్యం కలిగేటట్టుగా సరస్వతిని చప్పున దగ్గిరికి లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు.

సరస్వతి తూలినమనిషి తూకం నిలబెట్టుకోవటానికి తన్నుకున్నట్టు తన్నుకుని అతని చేతులను తోసేసి వినబడీ వినబడకుండా "థాంక్స్!" అని బయటికి వెళ్ళిపోయింది.

తన హీరోయిన్‌ను వెటకారం చేసిన సరస్వతి అదే పరిస్థితులలో ఏం చేస్తుందో తెలుసుకోవటం కనకం ఉద్దేశం అయితే ఆ ఉద్దేశం

సఫలమయింది...తన హీరోయిన్ శారదకాక సరస్వతి అయితే— రెంటికీ ఒకటే అర్థం. హీరోతో 'థాంక్స్!' అంటుందన్న మాట!

కనకం బల్ల దగ్గిరికి వెళ్ళి తన కథ కాగితాలన్నీ కెలికి, వణుకుతున్న చేత్తో, వంకర టింకర అక్షరాలతో, 'థాంక్స్!' అన్నది శారద అని రాసి కింద డాష్ గీసేశాడు.

9

"నన్నడిగితే కనకశ్రీ రాసిన కథలన్నిటిలోకి బెస్ట్! సోమర్సెట్ మామ్ రాయదగిన కథ. చివర ఆ ట్విస్టు! రిమార్కబుల్!"

'కథ బాగానే ఉందిగాని, ఎక్కడో చదివినట్టుందోయ్?'

'పోనిస్తూ—బూర్జువా స్టఫ్! జీవితాన్ని వొదిలేసి ఎక్కడికో పలాయనం చేసే కథలంటే నాకు చెడ్డమంట.'

'నాన్సెన్స్! నువు ఎక్కడికి పలాయనం చేసినా జీవితం నిన్ను వదలదనేది ఆ కథ నిరూపిస్తుంది. అది సింబాలికల్ స్టోరీ! ఆ అనాకారిమనిషి జీవితం. దానిమీద ఎంత రోత వున్నా జీవితేచ్ఛ నిన్ను దానికేసి లాగుతుంది. ఆ భ్రమనుంచి తప్పించుకోలేవు. ఇది మాష్టర్ పీస్. నువ్వు లక్ష చెప్పు.'

ఆ హైదరబాదు హొటల్లోకి అంతకు మునుపే వచ్చిన కనకం పక్క టేబిల్ దగ్గరవున్న కుర్రాళ్ళు తన సరికొత్త కథ గురించి చర్చించటం విని కంగారు పడ్డాడు. మనుషులు కథలను గురించి ఆలోచిస్తా

రని అతనికి తెలుసు. వాళ్ళ చర్చలు కథకులు వినే అవకాశం వుంటుందని అతను కలలోకూడా అనుకోలేదు. కనీసం అతని కెన్నడూ అనుభవం కాలేదు. తాను ఫలానా అని ఆ మాట్లాడేవాళ్ళకి తెలీదు. తెలిస్తే తనను విమర్శించేవాళ్ళు, సమర్థించేవాళ్ళుకూడా కాస్త జోరు తగ్గించివుందు రేమో.

భవానీప్రసాదు పక్కబల్లవద్ద జరిగే సంభాషణ విన్నట్లులేదు. విన్నా అతనికి అర్థంకాలేదో. ఈ హైదరాబాదు ప్రయాణం కేవలమూ కనకంకోసమే భవానీ పెట్టాడు. కనకానికి పట్నంలో వుండటం అసంభవ మయింది. తాను సర్వతిపట్ల చాలా తేలిక మనిషిలాగా ప్రవర్తించాడు. అతని అసలు స్వరూపం యింకెవరికీ తెలియకపోయినా సరస్వతికి తెలుసు. ఎట్లా ఆమె మొహం చూడడం?

కనకం పశ్చాత్తాపం వెంటనే ప్రారంభం కాలేదు. ఆ దిక్కుమాలిన కథను పత్రికకు పంపినతరవాత ఆరంభమైంది. తన భార్యాపిల్లలూ ప్లేనులో బొంబాయి వచ్చే ఏర్పాటుచేసి భవానీప్రసాదు కనకంతో కారులో హైదరాబాదు వచ్చాడు. తీరా వచ్చినాక భవానీప్రసాదుకు హైదరాబాదులో ఏదో పని తగలనే తగిలింది, వాళ్ళు వారంరోజులనుంచీ హైదరాబాదులోనే వున్నారు.

మానవజన్మ అన్నాక అందరూ ఎప్పుడో ఒకప్పుడు ఒక సిగ్గుపడే పని చేస్తారు. కనకం జీవితంలోనే డజను సంఘటన లున్నాయి-జ్ఞాపకం రాగానే తనమీద తనకే అసహ్యంవేసే పనులు సరస్వతిని మొదటి రోజునే పలకరించినప్పుడు తాను అతితెలివిగా అన్నమాట వాటిలో ఒకటి. అటువంటి సంఘటనలను మనసు మరిచిపోవటానికి ప్రయత్నిస్తుంది. ఆ ప్రయత్నంలో ఆ సంఘటనతోబాటు దానికి సంబంధించిన మనుషులనుకూడా మరవ యత్నిస్తుంది. ఐతే కనకానికి సరస్వతి మరువురాలేదు.

ఘోర మేమిటంటే తాను ఆమెను ముద్దుపెట్టుకోవడం మరవ రాని అనుభవం అయికూచుంది. దానికి కారణం చచ్చినా తెలియడం లేదు. సుందరితో అనుభవం జ్ఞాపకం రాదేం? ఇటువంటి వాటికి కారణాలు వెతకటం వృధా. మనిషి స్వభావపు లోతుల్లోకిపోతే హేతువాదం పనిచెయ్యదు.

క్షమాపణ చెబుతూ సరస్వతికి ఒక ఉత్తరం రాద్దామని కనకం పది సార్లయినా ప్రారంభించాడు. కాని ఒక్కసారీ ఉత్తరం పూర్తి చెయ్యలేదు. ఒకసారి. "నా మనసులో ఎక్కడో నీ మీద ప్రేమ ఉన్నదనుకుంటాను. ఈ మాట నీవు విశ్వసించాలని కాదు. నేనే పూర్తిగా నమ్మలేనిమాట. నిన్ను నమ్మమని ఎలా అడగను' అని కూడా రాశాడు. ఇంకో ఉత్తరంలో, "మీ సూర్యనారాయణగారి ఇంటి ఎడ్రసు తెలిస్తే వెళ్ళి చూసి వస్తాను ఆయన హైదరాబాదులో ఎక్కడ ఉన్నదీ నాకు తెలియదు." అని రాశాడు.

కాని ఒక్క ఉత్తరమూ పూర్తి కాలేదు, పోస్టు అసలే కాలేదు..

ఇప్పుడీ హొటల్లో కూచుని తన కథ గురించి కుర్రాళ్ళు మాట్లాడుకునే మాటలు వింటూంటే సరస్వతి చేసిన ఎద్దేవా జ్ఞాపకం వచ్చింది. ఇటువంటి కథలు నచ్చేవాళ్ళుంటారని సరస్వతి అన్నది. తాను ఆ కథ అసహ్యంగా ఉందని సరస్వతి దగ్గిర ఒప్పుకున్నాడు. కాని దాన్ని ఎవరో తెగమెచ్చుకుంటుంటే కనకానికి సంతోషమే కలిగింది. ఇంకెవరో విమర్శిస్తూ అన్న మాటలు చెవిని పెట్ట బుద్ధి కాలేదు.

హొటల్లో పని ముగించుకుని కనకమూ, భవానీ ప్రసాదూ కారులో బయలుదేరి రెండు ఫర్లాంగులు వెళ్ళారో లేదో కనకం, "కారాపు! కారాపు!" అని కేకపెట్టాడు. వాళ్ళ కారు ఒక సైకిల్ రిక్షాని దాటి వచ్చింది. ఆ రిక్షాలో సూర్యనారాయణ ఉన్నాడు.

కనకం ఆగిన కారులోంచి దిగి, సమీపానికి వచ్చిన సూర్య నారాయణతో 'వెదకబోయిన తీగె కాళ్ళకు తగిలింది, మీఎడ్రసు—' అని ఆగిపోయాడు. సూర్యనారాయణ పెద్ద ఆపదలో ఉన్నట్టుగా కని పించాడు. మొహం పెంకులాగా వుంది. హీనస్వరంతో 'మీరా?' అని ఊరుకున్నాడు.

'ఎక్కడికైనా తొందర పనిమీద వెళుతుంటే, మా కారుంది రండి' అన్నాడు కనకం.

సూర్యనారాయణ చప్పున దిగి రిక్షావాడికి డబ్బు లివ్వటానికి తొందరపడుతూ జేబులో చెయ్యిపెట్టాడు. కనకం రిక్షావాడికి చేతిలో ఒక అర్ధరూపాయపెట్టి, సూర్యనారాయణను కారులోకి ఎక్కించాడు.

'మా పిల్లకి బ్రెయిన్ ఫీవర్... మెనింజైటిస్... హాస్పటల్‌లో నిన్ననే చేర్చాం' అన్నాడు సూర్యనారాయణ.

'హాస్పిటల్‌కు పోదామా?' అన్నాడు కనకం.

'అవును. పోదాం. దగ్గిరే ఈ మలుపు తిరిగితే—'

వాళ్ళు హాస్పటలుకు వెళ్ళిన అరగంటకు సూర్యనారాయణ కూతురు పోయింది. కనకం ఎందుకంతగా షాక్ అయినాడో భవానీ ప్రసాదుకూడా ఊహించలేక పోయినాడు. కనకం ఏడుపు మొహం పెట్టలేదన్న మాటేగాని అతని కళ్ళనిండా నీళ్ళు!...

'భవానీ, నేను వెంటనే పట్నం వెళ్ళాలి' అన్నాడు కనకం ఆ సాయంకాలం హొటల్లో.

'నేను?'

'నీ యిష్టం. నువు బొంబాయి వెళ్ళిపో.'

'ఒక్కణ్ణేనా?'

"అయామ్ సారీ భవానీ. నేను బొంబాయి రాలేను. సరస్వతికి ఎవరూ లేరు."

"సరస్వతి ?"

"సూర్యనారాయణ సిస్టర్‌మీద బెంగ పట్టుకుం దేమిటి ?"

"నీకు చెప్పలేను. చెబితే అర్థం చేసుకోలేవు. ఈ పిల్ల చావు సరస్వతికి పెద్ద షాక్. ఆమె ఏ అఘాయిత్యమన్నా చెయ్యొచ్చు."

"సరే ఇద్దరం పోదాం పద."

మరో గంటకు వాళ్ళ కారు హైదరాబాదు పరిసరాలు దాటింది.

10

సరస్వతి కాలేజీలో దొరికింది. అప్పటికే ఆమెకు టెలిగ్రాం అందింది. మనిషిని చూస్తే ఏదో దయ్యంపట్టిన దానల్లే వుంది.

"నేను హైదరాబాదునుంచే వస్తున్నాను. ఈ ఘోరం జరిగేసరికి నేనక్కడే వున్నాను" అన్నాడు కనకం.

"నా మూలంగానే అది పోయింది... ... ...దాన్ని చంపాను" అన్నది సరస్వతి మొహానికి చేతులడ్డం పెట్టుకుని.

కనకం కంగారుగా చుట్టూ చూశాడు.

"ఇక్కడెందుకు ? మా యింటికిపోదాం రండి."

హిప్నొటైజు అయిన మనిషిలాగా సరస్వతి లేచి అతని వెంట వచ్చింది. ఇద్దరూ కారు వెనకసీటులో కూచున్నారు. అంతదాకా బల

వంతాన అణిచిపెట్టుకున్న సరస్వతి దుఃఖం కట్టలు తెంచుకుని వచ్చేసింది. కనకం ఆమె చేతులు రెండూ తన కుడి చేతితో గట్టిగా పట్టుకుని ఎడమచేత్తో ఆమె వీపు నిమిరాడు.

"టెరిబుల్ థింగ్! హారిబుల్! నేను హాస్పిటల్‌లోనే ఏడిచేవాణ్ణి! దుఃఖం ఆగలా! ... ... మీా రెంత బాధపడతారో నాకు తెలుసు. వెంటనే కారులో బయలుదేరి వచ్చేశాం. భవానీ ప్రోగ్రామంతా పాడుచేశాను ... ... ఇటువంటి బాధలు పంచుకునే వాళ్ళుండాలి."

కనకం అతికీ అతకకుండా చెప్పేమాటలు సరస్వతికి కొంత ఉపశాంతి కలిగించినట్టు కనబడ్డాయి. ఆమె చాలా ఆత్మనిగ్రహం గలది. టెలిగ్రాం అందినాక మూడుసార్లు బాత్‌రూమ్‌లోకి వెళ్ళి ఏడిచి, మొహం కడుక్కుని వచ్చిందట. అదృష్టవశాత్తూ క్లాసులేదు. క్లాసున్నా పిల్లలకు ఏదో పని కల్పించి తాను మెదలకుండా కూచోగలదే. ఆమెకు ఆగకుండా దుఃఖం వచ్చేసింది కనకాన్ని చూశాకనే!

వాళ్ళిద్దరినీ ఇంటిదగ్గిర దించి భవానీ ప్రసాదు కారు తీసుకుని ఎక్కడికో వెళ్ళిపోయాడు.

ఇద్దరూ కనకం గదిలో కూచున్నారు. సరస్వతి ఆ పిల్లను గురించి ఎన్నో విషయాలు జ్ఞాపకం తెచ్చుకుని చాలాసార్లు ఏడ్చింది. కనకం ఆమెను అంతగా ఓదార్చటానికి యత్నించలేదు. ఏడవటం తప్ప సరస్వతికి మరో బాధా నివారణోపాయం లేదు.

అతను రైలు స్టేషనులో జరిగిన సంగతులు జ్ఞాపకం చెయ్యగానే సరస్వతి వివశురాలై ఏడ్చింది. కనకం ఆమె ప్రక్కన కూచుని గట్టిగా పట్టుకుని, "అట్లా కుళ్ళిపోవద్దు. ఏం చేస్తాం? జీవితం చాలా క్రూరంగా ఉంటుంది. ఈ కష్టం ఇంతలో ఆరేదికాదు. ఏడవటానికి బోలెడంత టైముంది." అన్నాడు.

'నా గుండెలు మండిపోతున్నాయండీ. నా కోసం దిగులుపడే దానికి మెదడు చెడి ఉంటుంది. తనను చూడటానికి నేను రానని అది అప్పుడే చెప్పింది. పాపిష్టి దాన్ని వెధవ ఉద్యోగంకోసం పిల్లను పోగొట్టుకున్నాను. ఈ బాధతో ఎట్లా బతకటం?' అంటూ సరస్వతి మరింత ఏడ్చింది.

'అదే పొరపాటు. మెనింజెస్ ఎఫెక్ట్ కావటానికి అపేక్షలకూ ఏమీ సంబంధం లేదు.'

ఆమెను ఆలోచించకుండా చెయ్యటానికి కనకం తడుపుకో కుండా తనకు తెలిసిన విషాద గాథలన్నీ చెప్పుకుపోయాడు. ఆమె వింటున్నదా, లేదా అనికూడా చూడలేదు.

కొంచెం సేపటికి సరస్వతి శాంత తేరుకున్నది.

'మీ భోజనం మాట?' అన్నాడు కనకం.

'నా కేమీ వద్దు. నేనేం తింటాను. గొంతులో ఈలావుండ!' అన్నది సరస్వతి.

కనకం నౌకరును కేకేసి కాఫీ తీసుకు రమ్మన్నాడు. వాడు తెచ్చిన కాఫీని సరస్వతి విషం దిగమింగినట్టు మింగింది.

చీకటిపడే సమయానికి కనకం దీపం వెలిగించాడు.

'ఇక నేను నా లాడ్జికి పోతాను.' అన్నది సరస్వతి.

'లాడ్జిలో ఏముంది? ఇక్కడ అన్నీ జరిగిపోతాయి. స్నానం చెయ్యొచ్చు. భవానీ వచ్చాక మీ చీరెలూ అవీ తెచ్చిపెడతాడు. కాలేజీకి కూడా శలవు పెట్టండి. కొంప మునిగిపొయ్యేదేమీ లేదు.'

"చాలా ఉపకారం చేశారు. నేనేమీ కాను. నన్ను వెళ్ళ నివ్వండి."

"అందుకేనా హైదరాబాదునుంచి హడావుడిగా వచ్చాను."

సరస్వతి దీనంగా నవ్వి "నేనేమీ అఘాయిత్యం చెయ్యనులెండి. మీరు రాకముందు చాలా మోర్బిడ్‌గా ఉన్నానుగాని ఇప్పుడు లేను." అన్నది.

"ఒంటరిగా వుండగానే మళ్ళీ మోర్బిడిటీ రావచ్చు. మీ దిక్కడ ఉండిపోవటానికేమీ మొహమాటు పడక్కర్లేదు"

నౌకరు కారియర్‌లో భోజనం తెచ్చాడు. సరస్వతికి తిండి మింగుడు పడలేదు. కొంచెం చారన్నంతిని వదిలేసింది. కనకం కూడా తిండి సరిగా తినలేక పోయినాడు.

ఆ రాత్రికి పడుకునేటందుకు భవానీ ప్రసాదు సరస్వతికి మంచమూ పక్కా ఇచ్చాడు. దీపం ఆర్పేసి ఎవరి పక్కమీద వారు పడుకున్నాక కనకం కన్ను మూయలేదు. సరస్వతి నిద్రపోయినట్టే కనిపించింది. కాని ఒక అరగంట అవతల ఆమె నిశ్శబ్దంగా ఏడుస్తున్నట్టు అతనికి పొడగట్టింది. అతను లేచివెళ్ళి ఆమె పక్కన పడుకుని తలా, వీపూ నిమిరాడు.

కొంతసేపటికి సరస్వతి శాంతించి, "నాకీ సేవంతా ఎందుకు చేస్తున్నారు? ఇటువంటి ఋణాలు తీరటం చాలా కష్టం. నాబోటి దానికి అసలు చేతగాదు." అన్నది.

"అటువంటి దేమీలేదు. నాదికూడా మోడు బ్రతుకే. నాకే ఇటువంటి కష్టంవస్తే అర్థం చేసుకుని ఆదుకునే వాళ్ళుంటే వద్దంటానా?" అన్నాడు కనకం.

సరస్వతికి క్రమంగా నిద్రపట్టేసింది. కనకం చాలాసేపు నిద్ర పోలేదు. ఆమె ఉచ్ఛ్వాసనిశ్వాసాలు లెక్క పెడుతున్నవాడల్లే అయిపోయి, ఆమె దీర్ఘ నిశ్వాసం విడిచినప్పుడల్లా వీపు నిమురుతూ వచ్చాడు.



గాఢనిద్రలో సరస్వతి అతని డొక్కలోకి దూరింది. ఎప్పుడో చిన్ననాడు ఆ విధంగా ఎవరి డొక్కలోనే దూరిపడుకుని ఉంటుంది.

తాను సరస్వతికి తల్లి అయినట్లుగా తోచి కనకానికి నవ్వొచ్చింది.

■